# పతాకం న్యూస్
APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 223 | విశాఖపట్నం | 14-5-2026 గురువారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 223 | VISAKHAPATNAM | 14-5-2026 THURSDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



SBI

PATHAKAM NEWS

SCAN & PAY

UPI ID: 44576280686@sbi

BHIM | UPI

yono SBI | BHIM SBI Pay

G Pay | Paytm | Pay


## నిడమర్రులో కిమ్స్ ఆసుపత్రికి
# చంద్రబాబు శంకుస్థాపన



**మంగళగిరి, పతాకం న్యూస్:** రాజధాని అమరావతిలో త్వరలోనే 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి రాబోతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. దీనికి ఎలాంటి అనుమతులు కావాలన్న త్వరగా ఇస్తామని వెల్లడించారు. మంగళగిరి మండలం నిడమర్రులో కిమ్స్ ఆస్పత్రి నిర్మాణానికి సీఎం చంద్రబాబు భూమిపూజ చేశారు. అనంతరం బైసర్ స్కిల్ వర్సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అమరావతిలో కిమ్స్ ఆస్పత్రి, స్కిల్ వర్సిటీకి 23 ఎకరాలను సీఆర్‌డీఏ కేటాయించింది. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ గంటి హరీష్, పలువురు నేతలు పాల్గొన్నారు.

అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్యసేవలో లక్ష మంది సేవలు అందించే విధంగా తయారు చేయాలని, ప్రపంచంలో ప్రతి ముగ్గురు వైద్యుల్లో ఒక్కరు ఇక్కడి నుంచే ఉండాలని అన్నారు. అలానే 1000 మంది ట్రైనీలను సిద్ధం చేస్తామని వెల్లడించారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్‌అండ్‌టీ కలిసి పని మట్నదలుపెట్టారని తెలిపారు. డిసెంబర్ నాటికి భారత్‌కు క్వాంటం కంప్యూటింగ్‌కు చిరునామాకు అమరావతి అవుతుందని రెండేళ్లలో ప్రపంచానికి క్వాంటం కంప్యూటింగ్‌కు అమరావతి నుంచి సరఫరా చేస్తామని వెల్లడించారు. అలానే విదేశాలపై ఆధారపడకుండా అందరూ కరెంట్ ఉత్పత్తి తయారు చేసుకోవాలని అన్నారు. (తరువాయి 2వ పేజీలో)



# నాణ్యతకు తూట్లు!

- మారుతీనగర్ సమీపంలో కుంగిన రోడ్డు అంచు, ఏర్పడిన రంధ్రం
- చోడవరం- గవరవరం రోడ్డు పనుల్లో బయటపడుతున్న లోపాలు
- రూ.2.5 కోట్లతో నెల రోజుల క్రితం పూర్తి

**చోడవరం, పతాకం న్యూస్:** మండలంలోని చోడవరం-గవరవరం రహదారిని రెండున్నర కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసి కనీసం నెల రోజులు కాకముందు నాణ్యత లోపాలు బయటపడుతున్నాయి. కొన్నిచోట్ల అంచులు జారిపోతుండగా, మరికొన్నిచోట్ల చిన్నపాటి గోతులు ఏర్పడుతున్నాయి. చోడవరం-గవరవరం రహదారి మీదుగా చోడవరం, కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. చాలా ఏళ్ల నుంచి అభివృద్ధికి నోచుకోక పోవడంతో అడుగడుగునా గోతులు ఏర్పడి రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ రోడ్డు అభివృద్ధికి రూ.2.5 కోట్లు మంజూరు చేసింది. టెండర్ ద్వారా పని దక్కించుకున్న కాంట్రాక్టర్.. సుమారు నెల రోజుల క్రితం పూర్తి చేశారు. ప్రయాణం సాఫీగా సాగిపోతుందని ఆయా గ్రామాల ప్రజలు సంతోషించారు. కానీ వారి ఆనందం ఎంతో కాలం నిలిచేలా లేదు. పలుచోట్ల రహదారి పనుల్లో లోపాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. మారుతీనగర్- గవరవరం మధ్యలో తారురోడ్డు అంచులు జారిపోవడంతోపాటు, రోడ్డుపై చిన్న పాటి గుంతలు ఏర్పడుతున్నాయి. వర్షాలు పడితే ఈ గోతుల్లో నీరు చేరి, వాహనాల రాకపోకల సమయంలో టైర్ల ఒత్తిడితో పెద్ద గోతులుగా మారి, రహదారి ఛిద్రం అవుతుంది. దీంతో సమస్య మళ్లీ మొదటికొస్తుంది. రోడ్డు నిర్మాణ సమయంలో ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ కొరవడడం, లేదంటే కాంట్రాక్టర్‌తో కుమ్మక్కు కావడంతో నెల రోజుల్లోనే నాణ్యతాలోపాలు బయటపడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.




2లో

బలపరీక్షలో నెగ్గిన విజయ్ ప్రభుత్వం..

## కేజీబీవీలపై పెరుగుతున్న ఆసక్తి




5లో




6లో

జీఎల్‌పీ-1 మందులు అందరికీ ఒకే విధంగా ఎందుకు పని చేయవు?

## ఎమ్మెల్సీ అనంతబాబు బెయిల్ రద్దు



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబుకు గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన బెయిల్‌ను రాజమహేంద్రవరం ప్రత్యేక న్యాయస్థానం రద్దు చేసింది. డ్రైవర్ వీధి సుబ్రమణ్యం హత్య కేసుకు సంబంధించి నలుగురు సాక్షులను అనంతబాబు ప్రలోభపెట్టారని, తనకు అనుకూలంగా సాక్ష్యం చెప్పకపోతే చంపుతానని బెదిరించారని ఇచ్చిన బాధితుల ఫిర్యాదు మేరకు .... కాకినాడ జిల్లా సర్పవరం పోలీసులు ఏప్రిల్ 24 న అనంతబాబును అరెస్ట్ చేశారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా అనంతబాబు ఉన్నారు. హత్య కేసులో బెయిల్‌పై ఉంటూ సాక్షులను బెదిరించడాన్ని తీవ్రంగా పరిగణించిన కోర్టు ఆధారాలతో నిరూపణ కావడంతో బెయిల్ రద్దు చేసింది.

## పాడేరులో జరిగిన కిడారి వివాహానికి హాజరైన లోకేశ్




**పాడేరు, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు సమీపం తుమ్మరమెట్టలో బుధవారం జరిగిన రాష్ట్ర గిరిజన సహకార సంస్థ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, శ్రీ ప్రియ వివాహ వేడుకకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మంత్రి నారా లోకేష్ ను కలిసేందుకు వివిధ జంక్షన్ల వద్ద వేచి ఉన్న ప్రజలను పలకరించి, వారి నుంచి వినతులు స్వీకరించారు.



## సోనియాగాంధీకి మళ్లీ అస్వస్థత.. ఆసుపత్రికి తరలింపు

2లో

## సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాలు విడుదల...



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) 2026 సంవత్సరానికి గాను 12వ తరగతి ఫలితాలను బుధవారం విడుదల చేసింది. ఈ ఏడాది మొత్తం ఉత్తీర్ణత శాతం 85.20గా నమోదైంది. గతేడాది నమోదైన 88.39 శాతంతో పోలిస్తే ఇది సుమారు 3 శాతం తగ్గడం గమనార్హం. ఈ సంవత్సరం దేశ వ్యాప్తంగా 17,68,968 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఎప్పటిలాగే, ఈసారి కూడా ఫలితాల్లో బాలికలు సత్తా చాటారు. బాలికల ఉత్తీర్ణత శాతం 88.86గా ఉండగా, బాలుర ఉత్తీర్ణత శాతం 82.13గా నమోదైంది. అబ్బాయిల కంటే అమ్మాయిలు 6.73 శాతం అధికంగా ఉత్తీర్ణులయ్యారు. ప్రాంతాల వారీగా చూస్తే, కేరళలోని తిరువనంతపురం 95.62 శాతం ఉత్తీర్ణతతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది.


పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## 'ఆర్థికాభివృద్ధి'

ఒకానొక దేశపు సంపదను వృద్ధి చేయడం అన్న లక్ష్యమే ఆ దేశపు విధానాన్ని ప్రధానంగా నిర్ణయిస్తుందని ఆడమ్ స్మిత్ 1776లో తన ఉద్గ్రంథం 'వెల్త్ ఆఫ్ నేషన్స్'లో పరిగణించాడు. దేశంలోని వివిధ వర్గాల ప్రజల మధ్య ఆదాయం పంపిణీ ఏ ప్రాతిపదికన జరగాలన్న అంశానికి ప్రాధాన్యత లేదని అతడు ఎక్కడా చెప్పలేదు. అలాగే, డేవిడ్ రికార్డో కూడా కార్మికుల జీవన పరిస్థితుల మెరుగుదలకు ఏ ప్రాధాన్యతా లేదని ఎక్కడా చెప్పలేదు. కాని స్మిత్, రికార్డో ఆదాయ పంపిణీ సమస్యను పట్టించుకోకుండా కేవలం దేశ సంపద సైజు (పెట్టుబడుల విలువ) పైనే తమ దృష్టినంతటినీ సారించారు. పెట్టుబడుల సైజును బట్టి ఆ దేశపు ఆదాయం సైజు ఉంటుంది. ఇక ఆ ఆదాయం ఎలా పంపకం జరగాలన్నది విధానపరమైన సమస్యగా వారిద్దరూ భావించలేదు. కనీస అవసరాల స్థాయిని మించి వేతనాలను చెల్లిస్తే అది జనాభా వృద్ధికి దారి తీస్తుందన్న మాల్థస్ సిద్ధాంతాన్ని సాంప్రదాయ పెట్టుబడిదారీ సిద్ధాంతం స్వీకరించింది. ఆ సిద్ధాంతం ప్రకారం వేతనాలను కనీస స్థాయికి మించి గనుక పెంచితే అప్పుడు జనాభా పెరుగుతుంది. అందువలన మార్కెట్‌లోకి వచ్చే కార్మికుల సంఖ్య పెరుగుతుంది. అలా కార్మికుల సంఖ్య పెరుగుతుంది కనుక దానికి తగ్గట్టు వేతనాలు మళ్ళీ కనీస అవసరాల స్థాయికి చేరుకుంటాయి. అందుచేత ఆదాయ పంపిణీలో మెరుగుదల రావడం అనేది కార్మిక వర్గపు 'అలవాట'?ల' మీద ఆధారపడి వుంటుందే తప్ప ప్రభుత్వ విధానం మీద కాదు. ప్రభుత్వం ప్రధానంగా పెట్టుబడుల వృద్ధిపైన దృష్టి సారిస్తుంది. తద్వారా ఆదాయం వృద్ధి జరుగుతుంది. -ఇదీ సాంప్రదాయ పెట్టుబడిదారీ సిద్ధాంతం. దీనినిబట్టి ఆదాయ పంపిణీ విషయంలో ప్రభుత్వం పెద్దగా చేయగలిగేది ఏమీ ఉండదని సాంప్రదాయ సిద్ధాంతం నమ్ముతుందని చెప్పాలి. అయితే, ఆదాయ పంపిణీ విధానాన్ని దిగజార్చే విధానాలను అమలు చేసైనా సరే పెట్టుబడుల వృద్ధికి ప్రభుత్వం పూనుకోవాలనేది ఆ సిద్ధాంతం ఎక్కడా చెప్పలేదు. ఇది ఇటీవల కాలంలో అమలు జరుగుతున్న నయా ఉదారవాద విధానపు సిద్ధాంతంగా చెలామణీ అవుతోంది. దీనికి సాంప్రదాయ పెట్టుబడిదారీ సిద్ధాంతంలో ఎటువంటి మూలాలూ లేవు. నయా ఉదారవాద వ్యవస్థలో పెట్టుబడి ప్రపంచీకరణ జరుగుతుంది. కాని కార్మికులు మాత్రం ఆ యా దేశాలకే కట్టుబడి వుంటారు. పెట్టుబడి ఎక్కువగా పోగుబడేందుకు అనువైన పరిస్థితి ఎక్కడ ఉంటే అక్కడికి పెట్టుబడి పోతుంది. వేతనాల స్థాయి తక్కువగా ఉండడం అనేది అటువంటి అనుకూల పరిస్థితుల్లో ఒకటి. అందుచేత నయా ఉదారవాద విధానాలను అమలు చేసే ఏ దేశమైనా, తన దేశంలోకి పెట్టుబడులను ఎక్కువగా రాబట్టుకోడానికి, తద్వారా అధిక జిడిపి వృద్ధి రేటు సాధించడానికి, అనివార్యంగా కార్మికుల వేతనాలను కుదించడానికి, దానితోబాటు కార్మికుల హక్కులను నియంత్రించడానికి సిద్ధపడుతుంది. అందుచేత సాంప్రదాయ పెట్టుబడిదారీ సిద్ధాంతం పేరు చెప్పుకునో, మెజారిటీ ప్రజల ప్రయోజనాల పేరు చెప్పుకునో తన 'జిడిపి వృద్ధి రేటు సాధన' లక్ష్యాన్నే సర్వస్వంగా చెప్పుకుంటూ సమర్థించుకోడం చెల్లదు. అది కేవలం గుత్త పెట్టుబడిదారుల ప్రయోజనాలకు మాత్రమే ప్రాతినిధ్యం వహించే నయా ఉదారవాదపు సిద్ధాంతం. ఆర్థికాభివృద్ధి అంటేనే జిడిపి వృద్ధి అన్న సిద్ధాంతాన్ని బ్రెటన్‌వుడ్ సంస్థలు (ప్రపంచ బ్యాంక్, ఐ.ఎం.ఎఫ్) పనిగట్టుకుని ముందుకు తెచ్చాయి. తాము అంతకు మునుపు ప్రవేశ పెట్టిన ఆర్థికాభివృద్ధి విధానాలను అవే తిరగదోడాయి. కొంతమంది అభ్యుదయ భావాలున్న ఆర్థికవేత్తలు సైతం ఈ ఉచ్చులో చిక్కుకున్నారు. ఇదంతా సాంప్రదాయ సిద్ధాంతం చెప్పినదే అని వారిలో కొందరు భ్రమించడం కూడా జరిగింది. 'ఆర్థికాభివృద్ధి అంటే జిడిపి వృద్ధే' అన్న వాదనను తిరస్కరించడం అన్నది మొట్టమొదట జరిగినప్పుడే ప్రస్తుత వ్యవస్థను విమర్శనా పూర్వకంగా పరిశీలించడం సాధ్యపడుతుంది. అంటే ఐ.ఎం.ఎఫ్, ప్రపంచ బ్యాంక్ వంటి సంస్థలతోబాటు, మూడవ ప్రపంచ దేశాల్లోని పలు ప్రభుత్వాలు కూడా తమ దేశాల ఆర్థిక విజయాలను అంచనా వేసే ప్రాతిపదికను పూర్తిగా తిరస్కరించాలి. నయా ఉదారవాద శకంలో భారతదేశంలో పాలించిన ప్రభుత్వాలు తమ ఆర్థిక విజయాలకు కొలమానంగా జిడిపి వృద్ధి రేటును మాత్రమే చెప్పుకుంటూ వస్తున్నారు. తద్వారా అంతకు పూర్వం అమలు జరిగిన విధానాల కన్నా తాము మెరుగైన విధానాలను అమలు చేస్తున్నట్టు సమర్థించుకున్నారు. ఆర్థిక అసమానతలు, పౌష్టికాహార లేమి వంటివి దారుణ పరిస్థితులకు చేరుకుంటున్నా వాటిని పట్టించుకోలేదు. దేశంలో అత్యంత సంపన్నులైన ఒక శాతం వద్ద స్వాతంత్ర్యం వచ్చే నాటికి జాతీయాదాయంలో 12 శాతం వాటా చేరితే, 1982 నాటికి వారి వాటా 6 శాతానికి పడిపోయింది. నయా ఉదారవాద విధానాలు వచ్చాక, 2022-23 నాటికి అది ఏకంగా 23 శాతానికి పెరిగింది. గత 100 సంవత్సరాలలోనూ ఆదాయాల అసమానతలు ఇంత దారుణంగా ఎన్నడూ లేవు. గతంలో ప్రణాళికా సంఘం గ్రామీణ ప్రజల కనీస పౌష్టికాహార లభ్యత రోజుకు 2200 కేలరీలు అని ప్రాతిపదికగా నిర్ణయించింది. ఆ మేరకు పౌష్టికాహారం పొందలేకపోతున్న గ్రామీణ జనాభా శాతం 1973 నుంచి (ఆ ఏడాది నుంచే దేశంలో పేదరిక అధ్యయనం మొదలైంది) 1993 మధ్య కాలంలో ఒకే స్థాయిలో కొనసాగింది. ఆ తర్వాత 1993 నుంచి 2011 మధ్య కాలంలో ఆ శాతం 58 నుంచి 68 కి పెరిగింది. ఇక 2017-18 నాటికైతే అది ఏకంగా 80 శాతాన్ని దాటిపోయింది. దాంతో ప్రభుత్వం ఆ గణాంకాలనే ప్రజలకు అందకుండా తొక్కిపట్టింది. అంతేకాక రాబోయే కాలంలో గణాంకాలను సేకరించే విధానాన్నే మార్చేసింది! ఇక పట్టణ పేదల సంగతి చూస్తే వారిలో కూడా ఈ శాతం 57 నుంచి 65కి ఇదే కాలంలో (1993-2011 మధ్య) పెరిగింది. అయితే నయా ఉదారవాద కాలంలో బ్రహ్మాండంగా అభివృద్ధి జరిగిపోతోందన్న ప్రచారం చేసేవాళ్ళకి ఈ వాస్తవాలేమీ పట్టవు.

## త్వరలో కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ?



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర మంత్రి వర్గం పునర్వ్యవస్థీకరణకు రంగం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. మే నెల చివరి వారం లేదా జూన్ మొదటి వారంలో పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశాలున్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 15 నుంచి 20 వరకు విదేశీ పర్యటనలో ఉంటారు. ఆయన స్వదేశానికి తిరిగొచ్చిన తర్వాత ఏ రోజైనా మంత్రివర్గంలో మార్పులు జరగవచ్చునని తెలుస్తోంది. మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణపై ఎన్డీయేలో కీలక భాగస్వామి అయిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా ఇప్పటికే సూచన చేశారని సమాచారం. నరేంద్ర మోదీ 2024 జూన్ 9న మూడో సారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ జరుగుతుందని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. గత రెండేళ్లలో పదవులు నిర్వహించిన మంత్రుల పనితీరుపై మోదీ ఇప్పటికే సమీక్షించారని, ప్రస్తుత మంత్రివర్గంలో కొందరికి ఉద్వాసన తప్పదని చెబుతున్నారు. అంతేకాక ఈసారి యువ నేతలకు, మహిళలకు ప్రాధాన్యమివ్వనున్నారని అంటున్నారు.

## ఏపీ హైకోర్టు సీజేకు జడ్ ప్లస్ భద్రత..



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ లీసా గిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం భద్రతను పెంచింది. ఆమెకు 'జడ్ ప్లస్' కేటగిరీ భద్రత కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. జస్టిస్ లీసా గిల్‌కు ముప్పు పొంచి ఉందన్న అంచనాలు, సెక్యూరిటీ రివ్యూ కమిటీ సిఫార్సుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తక్షణమే చర్యలు చేపట్టాలని రాష్ట్ర డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఆయన విజయవాడ, గుంటూరు పోలీసు కమిషనరేట్ల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. రోజూ విజయవాడలోని తన నివాసం నుంచి అమరావతిలోని హైకోర్టుకు ప్రయాణించే మార్గంలో జస్టిస్ లీసా గిల్ కాన్వాయ్‌కు 'గ్రీన్ ఛానల్' ఏర్పాటు చేయాలని డీజీపీ ఆదేశించారు. దీనివల్ల ఆమె ప్రయాణ సమయంలో కాన్వాయ్ ఎక్కడా ఆగకుండా నేరుగా గమ్యస్థానానికి చేరుకుంటుంది. జస్టిస్ లీసా గిల్ 2026 ఏప్రిల్ 25న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఏపీ హైకోర్టుకు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా ఆమె రికార్డు సృష్టించారు.

## రాసి పెట్టుకోండి.. ధూళిపాళ్ల ఓడిపోవడం ఖాయం: అంబటి



**గుంటూరు, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని మామిళ్లపల్లి ఘటన ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. మొక్కజొన్న రైతులపై దాడులు జరిగాయని, అక్రమ కేసులు పెట్టారంటూ వైసీపీ చేపట్టిన 'చలో మామిళ్లపల్లి' కార్యక్రమంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు... ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రపై విరుచుకుపడ్డారు. రైతుల ఇళ్లు, గోడౌన్లపై దాడులు చేయించడం ఏంటని అంబటి ప్రశ్నించారు. ప్రశ్నించే వారిపైనే దాడులు చేస్తారా అంటూ మండిపడ్డారు. "వచ్చే ఎన్నికల్లో ధూళిపాళ్ల నరేంద్ర ఓడిపోవడం ఖాయం, ఇది రాసుకోండి" అంటూ మూడేళ్ల ముందే ఆయన జోస్యం చెప్పారు. రైతుల కాలి ధూళికి ఆయన కొట్టుకుపోతారని వ్యాఖ్యానించారు. మా కుటుంబంపై, మా కులంపై , మా పార్టీపై కక్ష కట్టి ఇలాంటి దాడులు చేస్తున్నారా అని అంబటి నిలదీశారు. గుంటూరు ఐజీ త్రిపాఠి ఖాకీ డ్రెస్ వేసుకోవడం లేదని, పచ్చ డ్రెస్ (టీడీపీ రంగు) వేసుకుంటున్నారని ఆరోపించారు. లోకేశ్, పెమ్మసాని ఏం చెబితే ఐజీ అది చేస్తున్నారని విమర్శించారు. తప్పు చేస్తే ఎంతటి పెద్ద అధికారినైనా చట్టప్రకారం శిక్షిస్తామని, తప్పుడు కేసులు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. గోడౌన్‌లో సీజ్ చేసిన మొక్కజొన్నను వెంటనే విడుదల చేయాలని కోరారు. అరెస్టులకు భయపడేది లేదని, అవసరమైతే జైలుకు వెళ్లడానికైనా సిద్ధమని అంబటి రాంబాబు స్పష్టం చేశారు.

## ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ధర్నా

**గుంటూరు, పతాకం న్యూస్:**ఒకే దేశం.. ఒకే పరీక్ష, నీట్ స్కాంల వల్ల 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారమైందని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని కదిరి రోడ్డులో బుధవారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎన్టీఏ ను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వాలే నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహించాలని నినాదాలు చేశారు. వైద్య విద్యా ఆశావహులైన విద్యార్థులను మానసికంగా హింసించిన ఎన్డీఏ సర్కార్ ప్రభుత్వం నుండి తప్పుకోవాలని, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని నినాదాలు చేశారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ చేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ సర్వేపల్లి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్ లు మాట్లాడుతూ వరుస నీట్ స్కామ్ లకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్రన్ రాజీనామా చేయడంతో పాటు కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు.

## ఇప్పుడు ఆ బ్రాండ్లన్నీ ఏపీ నుంచే: మంత్రి లోకేష్




**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో తయారీ రంగం దూసుకెళుతోందని, 'మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనేది ఇప్పుడు నాణ్యతకు, నమ్మకానికి చిహ్నంగా మారుతోందని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని తయారీ రంగం పురోగతిని వివరిస్తూ ఆయన బుధవారం సోషల్ మీడియాలో ఓ ఆసక్తికర పోస్ట్ చేశారు. దీనికి సంబంధించిన ఓ ప్రత్యేక వీడియోను కూడా పంచుకున్నారు. "మొబైల్ ఫోన్లు, స్క్రీన్ల నుంచి మొదలుకొని ఏసీలు, బైక్‌లు, కార్ల వరకు.. భారతీయులు విశ్వసించే ఎన్నో బ్రాండ్లు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో తయారవుతున్నాయి" అని లోకేష్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, పనుల వేగవంతమైన అమలు, బలమైన తయారీ వ్యవస్థ వల్లే ఇది సాధ్యమైందని వివరించారు. "మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనేది వేగంగా నాణ్యతకు, నమ్మకానికి ప్రతీకగా నిలుస్తోంది. ఈ ప్రయాణంలో మీరు కూడా భాగస్వాములు కండి. ఆంధ్రప్రదేశ్‌లో తయారు చేయండి.. ప్రపంచం కోసం తయారు చేయండి" అని లోకేష్ పిలుపునిచ్చారు. ఆయన షేర్ చేసిన వీడియోలో ఏపీలో కార్యకలాపాలు సాగిస్తున్న పలు ప్రఖ్యాత కంపెనీల ఉత్పత్తులను, తయారీ యూనిట్లను ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షించేందుకు, పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించేందుకు కట్టుబడి ఉందని ఈ పోస్ట్ ద్వారా స్పష్టమవుతోంది.

## బలపరీక్షలో నెగ్గిన విజయ్ ప్రభుత్వం..



**చెన్నై, పతాకం న్యూస్:** తమిళనాడు రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన సూపర్‌స్టార్ విజయ్, ముఖ్యమంత్రిగా తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. బుధవారం రాష్ట్ర అసెంబ్లీలో జరిగిన నాటకీయ విశ్వాస పరీక్షలో 'దళపతి' విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం సునాయాసంగా గట్టెక్కింది. ఈ బలపరీక్షలో విజయ్ ప్రభుత్వానికి అనుకూలంగా 144 మంది శాసనసభ్యులు మద్దతు పలకగా, 22 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. మరో ఐదుగురు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. గత నెల జరిగిన ఎన్నికల్లో అనూహ్య విజయం సాధించి అధికార పీఠం దక్కించుకున్న విజయ్, ఈ విశ్వాస పరీక్షతో తన ప్రభుత్వాన్ని నిలబెట్టుకున్నారు. అయితే, ఈ ఓటింగ్‌కు ముందు ప్రధాన ప్రతిపక్షమైన డీఎంకే తన 59 మంది ఎమ్మెల్యేలతో సభ నుంచి వాకౌట్ చేసింది. ఇక, మూడో అతిపెద్ద పార్టీ అయిన అన్నాడీఎంకే (47 మంది ఎమ్మెల్యేలు) ఓటింగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించినప్పటికీ, పార్టీలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామి ఆదేశాలను ధిక్కరిస్తూ ఆ పార్టీకి చెందిన 25 మంది ఎమ్మెల్యేలు విజయ్ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేయడం తమిళ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించింది. దీంతో ద్రవిడ రాజకీయాల్లో ఒకప్పుడు చక్రం తిప్పిన అన్నాడీఎంకే పార్టీలో చీలిక స్పష్టంగా కనిపించింది. డీఎంకే వాకౌట్, మరికొందరు తటస్థంగా ఉండటంతో, పళనిస్వామి వర్గానికి చెందిన 22 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. ఈ తిరుగుబాటుతో పళనిస్వామికి గట్టి రాజకీయ ఎదురుదెబ్బ తగిలినట్లయింది. విశ్వాస పరీక్షలో గెలిచిన అనంతరం విజయ్ మాట్లాడుతూ.. "మా ఎన్నికల గుర్తు అయిన విజిల్ చరిత్రను మార్చింది. మాది మైనార్టీ ప్రభుత్వమే అయినా, మైనార్టీల హక్కులను కాపాడే ప్రభుత్వంగా పనిచేస్తాం" అని స్పష్టం చేశారు. విజయ్ ప్రభుత్వం ప్రస్తుతానికి గండం నుంచి బయటపడినప్పటికీ, అన్నాడీఎంకేలో ఏర్పడిన ఈ చీలిక భవిష్యత్తులో తమిళనాడు రాజకీయ సమీకరణాలను ఎలా మారుస్తుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

(మొదటిపేజీ తరువాయి)

## చంద్రబాబు శంకుస్థాపన

రూ.2.40కే యూనిట్ కరెంట్ ఉత్పత్తి చేస్తున్నామని కరెంట్ ఛార్జీలు తగ్గుస్తున్నామని సీఎం వివరించారు. లక్ష మందికి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ: సంపద సృష్టించడం చాలా సులభమని సీఎం అన్నారు. హైదరాబాద్ దేశానికి మెడికల్ హబ్‌గా తయారైందని కొనియాడారు. లక్ష మందికి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తామని వెల్లడించారు. వైద్యులు కూడా ఏఐని నేర్చుకుంటున్నారని చెప్పారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన అరాచకం గతంలో ఎప్పుడూ చూడలేదని సీఎం చంద్రబాబు తెలిపారు. లక్ష మందికి ఉద్యోగాలు ఇవ్వాలనేదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని సీఎం స్పష్టం చేశారు. 2027 మే 13న కిమ్స్ ఆస్పత్రిని ప్రారంభిస్తామని వెల్లడించారు. 2028 ఆగస్టు 15 కంటే ముందే విశాఖలో గూగుల్ ఆపరేషన్‌లు ప్రారంభిస్తుందని అలానే 2028 డిసెంబర్‌లోపు ఫేస్ 1 పూర్తి చేయాలని ఆర్సెల్లార్ మిత్తల్‌కు ఆదేశాలు ఇచ్చామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. "ట్రూఅప్ ఛార్జీలు వసూలు చేయకుండా చర్యలు తీసుకున్నాం. ప్రపంచంలో అనేక మార్పులు వస్తున్నాయి. వైద్యుల కంటే నర్సులకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. రాష్ట్రంలో ఆరోగ్యానికి రూ.20 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. యూరియా వేసి పంటలు పండిస్తున్నారు. అందరి ఆరోగ్యం కాపాడే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుంది. భవిష్యత్తులో వర్క్ ఫ్రం హోం వస్తుంది.. ప్రభుత్వంలో కూడా తీసుకొస్తాం. పది కార్లతో కాన్వాయ్‌గా రావడం ఫ్యాషనైంది సెక్యూరిటీ అర్ధవంతంగా ఉండాలి. ప్రతి ఇంటిపై సోలార్ పెట్టుకోండి విద్యుత్ ఛార్జీలు చెల్లించే అవసరం ఉండదు. సోలార్ ఏర్పాటు చేసుకునేవారికి సబ్సిడీ కూడా అందిస్తున్నాం." ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రాజధానికి భూములిచ్చిన రైతులకు అండగా ఉంటామని ఫేజ్-2కు పిలుపునిస్తే రైతులు ముందుకొచ్చారని సీఎం అన్నారు. రాబోయే 20 ఏళ్లలో ప్రపంచంలోనే గొప్పదైన నగరంగా అమరావతి నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక్క అమరావతిపైనే శ్రద్ధ పెట్టట్లేదని విశాఖను విశ్వనగరంగా చేస్తున్నామని వివరించారు. రాయలసీమను రతనాల సీమగా మారుస్తున్నామని అక్కడికి అనేక పరిశ్రమలు వస్తున్నాయని వెల్లడించారు. ఏరో స్పేస్ హబ్‌గా అనంతపురం, టెక్నాలజీ హబ్‌గా రాయలసీమ తయారవుతోందని అన్నారు. తిరుపతిలో ఏరో స్పేస్ సిటీ, కర్నూలులో డ్రోన్ సిటీ వస్తోందని తెలిపారు.

# 194 కేజీల గంజాయి స్వాధీనం.. ముగ్గురు అరెస్టు




**బుచ్చెయ్యపేట, పతాకం న్యూస్:** మండలంలో పోలీసులు 194 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, ముగ్గురిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్పీ తుహిన్ సిన్హా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. బుచ్చెయ్యపేట మండలంలో బంగారుమెట్ట- అనకాపల్లి రోడ్డులోని గొన్నవానిపాలెం జంక్షన్ వద్ద సోమవారం సాయంత్రం పోలీసులు, ఈగల్ టీమ్, స్పెషల్ బ్రాంచి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో బంగారుమెట్ట జంక్షన్ వైపు నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న ఒక కారు, ద్విచక్ర వాహనాన్ని ఆపి సోదా చేశారు. కారులో ఆరు గోనె సంచుల్లో ప్యాకింగ్ చేసిన గంజాయిని గుర్తించారు. దీనిని రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రెవెన్యూ సిబ్బంది సమక్షంలో పంచనామా నిర్వహించి, గంజాయిని తూకం వేశారు. మొత్తం 194 కిలోలు వున్నట్టు నిర్ధారించారు. దీనికి సంబంధించి చీడికాడ మండలం బైలపూడి గ్రామానికి చెందిన గుమ్మాల పేరునాయుడు, డ్రైవర్ గొల్లవిల్లి గణేశ్, అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం గజ్జేడు గ్రామానికి చెందిన మండిపల్లి సత్తిబాబుగా గుర్తించి అరెస్టు చేశారు. గంజాయితోపాటు మూడు సెల్‌ఫోన్లు, కారు, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని ఎక్కడ కొనుగోలు చేశారు? ఎక్కడికి రవాణా చేస్తున్నారు? అన్నదానిపై లోతుగా విచారిస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. గంజాయి పట్టుకున్న ఎస్ఐ శ్రీనివాసరావును, పోలీసు సిబ్బందిని ఆచప అభినందించి ప్రశంసాపత్రం, నగదు రివార్డు అందించారు. మీడియా సమావేశంలో డీఎస్పీ ఎం.శ్రావణి, సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వెంకన్న నియామకం



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** అమలాపురంలో జరిగిన అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలో ఈనెల 11 నుంచి 13 వరకు జరిగిన సభల్లో రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడుగా డి వెంకన్న ని ఎన్నుకున్నారు.. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నిక కాబడిన వెంకన్న కి సిపిఎం కార్యకర్తలు ప్రజలు అరస వ్యక్తం చేశారు. డి వెంకన్న మీడియా సమావేశంలో మాట్లా డుతూ రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది వ్యవసాయొద్ద కార్మికులు దళితులు గిరిజనులు, వృత్తిదారులు సన్న చిన్న కారు రైతులు యొక్క ప్రతినిధులు మహాసభలో పాల్గొన్నారు. ముఖ్యంగా మహాసభలో దళితులపై దాడులు కులవివక్ష అరికట్టి దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని దేశానికి స్వతంత్రం వచ్చి 79 సంవత్సరాల కావస్తున్న నేటికీ దళితులు గిరిజల్లపై దాడులు దౌర్జన్యం హత్యలు, హత్యాచారాలు మహిళలపై రోజురోజుకు పెరిగిపోతున్నాయని మహాసభలో ఆందోళన వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. మతోన్మాదసక్తులు దాడులు తీవ్రతం అయ్యాయని ఒక ప్రకటనలో తెలిపారు. ఓ పక్క రాష్ట్రంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టడంతో పాటు దళితులపై వ్యతిరేకతను రెచ్చగొడుతున్నారని ఆఖరికి క్రైస్తవ మతం తీసుకున్న దళితులను ఎస్సీలు కారని వారిని బీసీలుగానే గుర్తించాలని సుప్రీంకోర్టు తీర్పు అసలాగా తీసుకొని పాత సర్టిఫికెట్లు సైతం రద్దు చేయించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహాసభలో తీవ్రంగా ఖండించిందని తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అప్రతిష్టంగా అమలు చేయాలని ఈ నెల 25న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేయాలని రాష్ట్రంలో సమగ్రమైన భూ పంపిణీ చేయాలని ధనవంతులు చేతుల్లో అసైన్డ్ భూములు తిరిగి పేదలకు అప్పగించాలని రాష్ట్రంలో జరుగుతున్న రీసరి వేలో వస్తున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని వలస కార్మికులకు సమగ్రమైన చట్టం చేయాలని పేదలకు మూడు సెంట్లు స్థలం ఇచ్చి ప్రభుత్వమే ఇల్లు నిర్మించాలని పెరిగిన ధరలు కనుగొనక కూల్ రేట్లు పెంచాలని డ్రగ్స్ గంజాయిని అరికట్టాలని రాష్ట్రంలో శాంతిభద్రతలు రక్షించి అమలు కానీ ఆరోగ్యానికి తక్షణమే పూర్తిస్థాయిలో అమలు చేసే విధంగా ముందుకు వెళ్లాలని మహిళలకు మైనర్ బాలికలపై అత్యాచారాలు అరికట్టాలని రాష్ట్రంలో అన్ని గ్రామాలకు మంచినీళ్లు రోడ్లు కరెంటు సమస్యలు పరిష్కారం చేయాలని పేదలకు విద్యా వైద్యం అందించి,పెరుగుతున్న ధరలు అరికట్టాలని, దళితులు గిరిజనులుకు ఉచిత విద్యుత్తు ప్రతిష్టంగా అమలు చేయాలని అనేక తీర్మానాలు చేశారు మహాసభలో వెంకన్నతో పాటు అనకాపల్లి జిల్లా నుండి విమాడుగుల మండలానికి చెందిన కే భవాని ఎస్సై రాయవరం మండలానికి చెందిన ఎం సత్యనారాయణ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు

## స్టీల్‌ప్లాంట్ సీఎండీగా ప్రభాకర్ బాధ్యతల స్వీకరణ




**గాజువాక, పతాకం న్యూస్:** రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్- విశాఖ స్టీల్‌ప్లాంటు) సీఎండీగా ఎంఎన్‌వీఎస్ ప్రభాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఉక్కు ఉత్పత్తి రంగంలో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగిన ఆయన ఇక్కడికి రాకముందు ఎన్ఎండీసీలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారు. విశాఖ స్టీల్‌ప్లాంటు ఆర్థిక సుస్థిరత, దీర్ఘకాలిక అభివృద్ధి దిశగా పయనిస్తున్న కీలక సమయంలో ఆయన సీఎండీగా రావడం సంస్థ పురోభివృద్ధికి మరింత ఊతం ఇస్తుందని ఉక్కు వర్గాలు ఆశిస్తున్నాయి. విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు డైరెక్టర్ (పర్సనల్) రాకేశ్ నందన్ సహాయ్ రాజీనామాను కేంద్రం ఆమోదించింది. ఈ విషయాన్ని వెల్లడించకుండా ప్రస్తుతం ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా ఉన్న ఏకే బాగ్చికి డైరెక్టర్ పర్సనల్ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు బాధ్యతలు నిర్వహించేవారు ఉద్యోగుల సమస్యలపై నిర్ణయాలు తీసుకునే అవకాశం లేదు. జీతాలు, సర్వీసు లెక్కింపు, పదోన్నతులు, బకాయిల విడుదల వంటి వ్యవహారాలపై పూర్తిస్థాయి డైరెక్టర్ మాత్రమే నిర్ణయం తీసుకుంటారు. దీంతో ఉద్యోగ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

## అక్రమ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్.. ఎనిమిది మంది అరెస్ట్

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖలో అక్రమంగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఎనిమిది మంది నిందితులను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.2 కోట్ల విలువైన ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, బ్యాంక్ పాస్‌బుక్‌లు, ఇతర డిజిటల్ ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల మొబైల్ డేటా ఆధారంగా పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో దాడి చేసిన విశాఖ పోలీసులు.. ప్రధాన నిందితుడు పఖరాని కరణ్‌తో పాటు ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ముఠా గోవాను కేంద్రంగా చేసుకుని ఏపీ, కర్ణాటక, యూపీ, మధ్యప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో టెలిగ్రామ్ ద్వారా బెట్టింగ్ నెట్‌వర్క్ నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

## సంకల్పము,చైతన్యము- అభ్యుదయం పిల్లలు అలవాట్లు ప్రవర్తనపై పర్యవేక్షణ అవసరం: ఎస్ఐ సత్యనారాయణ




**దేవరాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం పరిధిలో పిల్లలు అలవాట్లు ప్రవర్తన పై నిరంతరం పర్యవేక్షణ అవసరం అని కొంతమంది ప్రజలతో ఎస్ఐ సత్యనారాయణ పంచుకున్నారు. సంబువానిపాలెం గ్రామం లో సంకల్పము 2.0 చైతన్యము 2.0 మరియు అభ్యుదయం 2.0 కింద అవగాహన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామస్తులు, గ్రామ యువత పాల్గొన్నారు.గ్రామ యువతకు మత్తు పదార్థాలకు గంజాయి దూరంగా ఉండి మీ బ్రతుకును మీరే బాగు చేసుకోవాలి వీటినన్నిటికీ దూరంగా ఉండి మన అలవాట్లు మనమే మార్చుకొని సమాజంలో తలెత్తుకొని బ్రతికే అలవాట్లు ఉండాలని ఎస్సై సత్యనారాయణ సూచించారు. మీ పిల్లలు బడికి కళాశాలకు వెళ్లే ఆ మార్గాలను పిల్లలపై తల్లిదండ్రులు పూర్తిస్థాయి దృష్టి సారించాలని వారి అలవాట్లు ప్రవర్తన ఎప్పటికప్పుడు సమీక్షించీ పిల్లలు సరైన మార్గంలో విద్యను అభ్యసించి తమ యొక్క లక్ష్యాల్ని సాధించే విధంగా ముందుకు వెళ్లాలని దానికి తల్లిదండ్రులు అడుగులు వేయాలని ఎస్సై సత్యనారాయణ ప్రజలతో మమేకమై ఒక లక్ష్యంతో పని చేయాలని తెలిపారు

## కొత్త విద్యుత్తు లైన్ల కోసం చెట్లను నరికివేత..



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** గ్రామాలకు నాణ్యమైన, నిరంతం విద్యుత్ సరఫరాకు ఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే ఇదే సమయంలో విద్యుత్ లైన్లకు అడ్డుగా వున్నాయంటూ చెట్లతోపాటు భారీ వృక్షాలను సైతం నిర్దాక్షణ్యంగా నరికివేస్తున్నారు. దీనిపై అన్ని వర్గాల ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనుల పేరుతో ఏళ్ల తరబడి వయసున్న వృక్షాలను నరికివేయడం తగదని అంటున్నారు. ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా గృహాలకు, వ్యవసాయ రంగానికి వేర్వేరుగా విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక లైన్లు వేస్తున్నారు. ప్రస్తుతం నర్సీపట్నం-అడ్డరోడ్డు మార్గంలో కొత్తగా విద్యుత్ స్తంభాలు అమర్చుతున్నారు. కోటవురట్ల మండలం రామచంద్రపురం ఫీడర్ పనులు జరుగుతున్నాయి. విద్యుత్ స్తంభాలు పాతడానికి మెయిన్ రోడ్డుకు పక్కన భారీ వృక్షాలతోపాటు, ఏపుగా పెరుగుతున్న చెట్లను విద్యుత్ రంపాలతో అడ్డంగా కోసేస్తున్నారు. అభివృద్ధి పనుల నిమిత్తం చెట్లు నరకాల్సి వస్తే.. ముందుగా వాల్టా చట్టం ప్రకారం రెవెన్యూ కార్యాలయంలో అనుమతి తీసుకోవాలి. ఒక చెట్టు తొలగిస్తే.. దానికిబదులు పది మొక్కలు నాటాలి. కానీ విద్యుత్‌లైన్ల ఏర్పాటు కోసం వృక్షాలను నరికివేస్తున్న చోట ఈ నిబంధన అమలు కావడంలేదు. చెట్లను పెంచండి. వాటిని కాపాడండి. అవి మనల్ని కాపాడతాయంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు ఒక పక్క ప్రచారం చేస్తూ.. మరోపక్క వృక్షాలను నిలువునా నరికివేస్తుంటే ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వీలైనంత వరకు చెట్లను నరకకుండా ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలని, తప్పనిసరైతే కొమ్మల వరకే నరికివేయాలని సూచిస్తున్నారు.

## కొట్లాటలో ముగ్గురికి గాయాలు

**రేగిడి, పతాకం న్యూస్:** మండలంలోని వండానిపేట గ్రామంలో టీడీపీ, వైసీపీ మద్దతుదారుల మధ్య జరిగిన కొట్లాటలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత కొన్నాళ్లుగా గ్రామంలో రెండు వర్గాల మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఇటీవల సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తయిన నేపథ్యంలో గ్రామంలో టీడీపీ మద్దతుదారులు రక్షిత కులా యిలు వేస్తున్నారు. ఈక్రమంలో రెండు కుటుంబాల మధ్య కులాయిల విషయమై ఘర్షణ జరిగింది. దీనిపై ఇరువర్గాలు కలుగజేసుకోవటంతో కొట్లాటకు దారితీ సింది

## టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి: సంధ్యారాణి




**పాడేరు, పతాకం న్యూస్:** జిల్లాలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. స్థానిక కాఫీ హౌస్‌లో టీడీపీ నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్షేత్రస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయాలన్నారు. క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులు గ్రామ స్థాయిలో నిత్యం ప్రజలతో మమేకం కావాలన్నారు. గ్రామాల్లోని సమస్యలను పార్టీ పెద్దలు లేదా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటేలా నేతలు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అధిక సంఖ్యలో పంచాయతీలను కైవసం చేసుకునేలా ఇప్పటి నుంచే నేతలు ప్రణాళికాబద్ధంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరావు, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, టూరిజం డైరెక్టర్ కేవీ రమేశ్‌నాయుడు, టీడీపీ సీనియర్ నేతలు సోమెలి చిట్టిబాబు, రేగం కొండబాబు, నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన పార్టీ నేతలు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలలందించాలి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** కేజీహెచ్‌తోపాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పరిపాలనలో బాధ్యత, పర్యవేక్షణ, సిబ్బంది వినియోగం, మార్గదర్శక వ్యవస్థ బలోపేతం చేయాలని ఎంపీ శ్రీభరత్ సూచించారు. ఆంధ్ర మెడికల్ కళాశాలలో కేజీహెచ్ అభివృద్ధి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సిబ్బంది అందుబాటులో లేక రోగులు వైద్య సేవల కోసం నిరీక్షించాల్సి వస్తోందన్నారు. ఎంఆర్ఐ, సీటీ స్కాన్, ల్యాబ్ పరీక్షల్లో జాప్యం లేకుండా చూడాలనారు. ఆస్పత్రి సేవలపై వస్తున్న ఫిర్యాదులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని విభాగాల్లో పడకల కొరత కారణంగా ఇద్దరు రోగులు ఒకే బెడ్‌ను వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఉందని, మరికొన్ని విభాగాల్లో పడకలు ఖాళీగా కనిపిస్తున్నాయన్నారు. అత్యవసర విభాగాల్లో సౌకర్యాల విస్తరణ, ఎయిర్ కండిషనింగ్ సమస్యల పరిష్కారం, మరుగుదొడ్ల నిర్వహణ, స్ట్రెచర్లు, పార్కింగ్ నిర్వహణ వంటి అంశాలపై దృష్టిసారించాలన్నారు. నిరక్షరాస్యులు ఆస్పత్రి వ్యవస్థలో ఎలా ముందుకువెళ్లాలో సమాచారం, మార్గదర్శకత్వం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఉచితంగా ఇవ్వాల్సిన మందులు, ఇతర సామగ్రి బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. అక్రమ వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలపై ఎంపీ తీవ్రంగా స్పందించారు. మృతదేహాల తరలింపు, పోస్టుమార్టం వంటి సేవలకు డబ్బులు డిమాండ్ చేస్తే సహించబోమన్నారు. అత్యుత్తమ సేవలందిస్తున్న వైద్యులు, సిబ్బందిని ప్రోత్సహించడంతోపాటు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో మంచి సంస్కృతి ఏర్పడుతుందన్నారు. కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ మాట్లాడుతూ రోగులకు మార్గదర్శకం అందించేందుకు ఆస్పత్రి పరిధిలో ఎనిమిది మే ఐ హెల్ప్ యూ డెస్కులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఓపీ విభాగం, ల్యాబ్ కేంద్రాలు, ఇతర ప్రధాన ప్రాంతాల్లో నర్సింగ్ విద్యార్థులు, భద్రతా సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బందితో సహాయక వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. సమాచార కేంద్రాల ఏర్పాటును దశల వారీగా చేపడుతున్నామన్నారు. రోగుల ఫాలోఅప్ వ్యవస్థను బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ ఫిర్యాదుల కోసం కంప్లైంట్ బాక్స్‌లు, టోల్ ఫ్రీ నంబర్లు అందుబాటులో ఉంచామని, ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొంతమంది అవుట్ సోర్సింగ్ సిబ్బందిపై సస్పెన్షన్, టెర్మినేషన్ చర్యలు తీసుకున్నట్టు వెల్లడించారు. ఉద్యోగులపై వచ్చిన ఫిర్యాదులపైనా విచారణ జరుపుతున్నామన్నారు. సమావేశంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ చైర్మన్ సీతం రాజు సుధాకర్, విభాగాధిపతులు, అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

## పోలీసుల విచారణకు బండి భగీరథ్ గైర్హాజరు



**హైదరాబాద్, పతాకం న్యూస్:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్.. పోలీసుల విచారణకు గైర్హాజర య్యారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదయ్యింది. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం ఈ కేసును విచారిస్తోంది. ఇందులో భాగంగా విచారణకు రావాల్సిందిగా భగీరథ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు పోలీసుల ముందు విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే సమయం గడిచినప్పటికీ భగీరథ్.. పోలీసుల విచారణకు హాజరు కాలేదు. ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో పలు సెక్షన్లను పోలీసులు జోడించారు. దీనీ 74,75 తో పాటు సెక్షన్ 5 (ఐ) రెడ్ విత్ 6 కింద కేసులు నమోదు చేశారు. బాధితురాలి నుంచి రెండో సారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. తాజాగా నిందితుడిపై తీవ్రమైన లైంగిక దాడి, ముందుగా ప్లాన్ చేసి లైంగిక చర్యలకు పాల్పడినట్లు సెక్షన్ 5 (ఐ)ను కూడా పోలీసులు జతపరిచారు. మరోవైపు ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టులో బండి భగీరథ్ పిటిషన్ వేశారు. రేపు (గురువారం) ఈ పిటిషన్‌పై హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ చేయనుంది.

# పంటల మద్దతు ధరను పెంచుతూ కేంద్రం నిర్ణయం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం దేశవ్యాప్తంగా ఉన్న రైతాంగానికి భారీ ఊరటనిచ్చింది. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతుల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది.

రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా, ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరను ప్రభుత్వం పెంచింది. పెట్టుబడి ఖర్చుపై 50 శాతం అదనంగా కలిపి కొత్త ధరలను ఖరారు చేశారు. వరి క్వింటాల్‌కు రూ. 2,441 గా నిర్ణయించారు. గ్రేడ్-ఏ వరి క్వింటాల్‌కు రూ. 2,461 గా మద్దతు ధరను ఖరారు చేశారు. ఈ ఖరీఫ్ సీజన్ మద్దతు ధర కోసం కేంద్రం ఏకంగా రూ. 2.6 లక్షల కోట్లను కేటాయించడం విశేషం.

వ్యవసాయంతో పాటు రవాణా, ఇంధన రంగాలకు కూడా కేంద్ర కేబినెట్ పెద్దపీట వేసింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అప్‌గ్రేడ్ చేసేందుకు ఆమోదం తెలిపారు. ఇంధన భద్రత కోసం ఈ పథకానికి రూ. 37,500 కోట్లు కేటాయించారు. సర్కెజ్ - ధోలేరా మధ్య సెమీ హై స్పీడ్ డబుల్ రైల్వే లైన్ నిర్మాణం కోసం రూ. 20,065 కోట్లు మంజూరు చేస్తూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

## 'నీట్' మాఫియాను అరెస్టు చేయాలి




**విజయనగరం, పతాకం న్యూస్:** నీట్ పరీక్ష పత్రాల లీకేజీకి కారణమైన మాఫియాను వెంటనే అరెస్టు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలొద్దని హెచ్చరించారు. నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద విద్యార్థులు నిరసన తెలిపారు. 'విద్య అమ్మకానికి కాదు -- విద్య మన హక్కు, నీట్ మాఫియాను అరెస్ట్ చేయాలి, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు- అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ... దేశ భవిష్యత్తును నిర్మించాల్సిన విద్యా వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టి నిర్వీర్యం చేస్తోందన్నారు. నీట్ పేపర్ లీకేజీ సంఘటన సాధారణ నిర్లక్ష్యం కాదని, ఇది విద్యార్థుల కలలను దోచుకునే విద్యా మాఫియాల దౌర్జన్యమని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత లేకపోవడం వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతోందన్నారు. కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు తమ అసెంబ్లీలో నీట్ కు వ్యతిరేకంగా తీర్మానం చేశాయని, కానీ మన రాష్ట్ర నాయకులు మాత్రం కేంద్ర ప్రభుత్వానికి మడుగులొత్తుతున్నారని వివరించారు. 2015 నుంచి ఇప్పటి వరకు ఎన్‌టిఎ నిర్వహించిన పరీక్షల్లో నీట్ పరీక్ష నాలుగు సార్లు పేపర్ లీకేజీ అయ్యిందని, యుజిసి నెట్ పరీక్ష ఒకసారి రద్దయ్యిందని, ఇది ఎన్‌టిఎ వైఫల్యమన్నారు. పేపరు లీకేజీ ఘటనపై వెంటనే పూర్తి స్థాయి న్యాయ విచారణ జరిపి, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి డి రాము, జిల్లా గర్ల్స్ కన్వీనర్ శిరీష, జిల్లా నాయకులు సోమేష్, జగదీష్, డివైఎఫ్‌ఐ నాయకులు హరీష్, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటనను విజయవంతం చేయండి



**నరసన్నపేట, పతాకం న్యూస్:** సీఎం నారా చంద్రబాబునాయుడు నరసన్నపేట పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, రాష్ట్ర, జిల్లా, మండల పార్టీ కార్యవర్గ సభ్యులతో విస్తృతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన ద్వారా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే మంచి అవకాశం లభిస్తుందని చెప్పారు. పార్టీ బలోపేతానికి గ్రామస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాల్సిన అవసరం ఉందని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని అన్నారు. నాయకులంతా సమన్వయంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి బగ్గు అర్చన మాట్లాడుతూ మహిళలు, యువత పార్టీ కార్యక్రమాల్లో మరింత చురుగ్గా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అందరి కృషితో పార్టీ విజయాలకు బాటలు వేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు తామరాపల్లి, జమ్ము జంక్షన్ వద్ద హెలీప్యాడ్‌లను, ఎస్‌వీఎల్ రైస్ మిల్లు వద్ద మైదానం ప్రాంతాలను అధికారులతో కలసి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై చర్చించారు.

## పంచాయతీరాజ్‌కు అవార్డుల పంట



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలోని పంచాయతీలు మరో మూడు జాతీయ అవార్డులు సాధించాయి. జాతీయ పంచా యతీరాజ్ దినోత్సవం సంద ర్భంగా ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ఐదు జాతీయ అవార్డులు దక్కించుకోగా, తాజాగా ప్రత్యేక కేటగిరీ కింద మరో మూడు అవార్డులను కైవసం చేసుకుంది. కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ మంగళవారం ప్రత్యేక కేటగిరీ కింద అవార్డులను ప్రకటించింది. క్లైమేట్ యాక్షన్ ప్రత్యేక పంచాయతీ అవార్డుల కింద చిత్తూరు జిల్లా కందులవారిపల్లె మొదటి ర్యాంకు సాధించింది. ఆత్మనిర్భర్ పంచాయతీ ప్రత్యేక అవార్డు చిత్తూరు జిల్లా కాణిపాకం పంచాయతీ రెండో స్థానం దక్కించుకుంది. పంచాయతీ క్షంత నిర్మాణ్ సర్వోత్తమ్ సంతన్ పురస్కార్ కింద చిత్తూరు జిల్లా పంచాయతీ రీసోర్స్ కేంద్రానికి మొదటి ర్యాంకు లభించింది. ఏప్రిల్ 24న జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ప్రకటించిన జాతీయ అవార్డుల్లో రాష్ట్రానికి ఐదు అవార్డులు దక్కాయి. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతాత్ వికాస్ పురస్కార్, నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతాత్ వికాస్ పురస్కార్‌లను మన పంచాయతీలు దక్కించుకున్నాయి. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సతాత్ వికాస్ పురస్కార్ గ్రామ పంచాయతీ కేటగిరీ కింద సుపరిపాలనకు సంబంధించి అనకాపల్లి జిల్లా శృంగవరం పంచాయతీ మొదటి ర్యాంకు, మహిళా స్నేహపూర్తి పంచాయతీగా తిరుపతి జిల్లా బొక్కసంపాలెంకు మొదటి ర్యాంకు, పేదరిక నిర్మూలన- జీవనోపాధుల పెంపు కేటగిరీలో కడప జిల్లా చెమ్ముళ్లపల్లి పంచాయతీ రెండో ర్యాంకు, స్వయంగా మౌలిక వసతులు కల్పించిన పంచాయతీల కేటగిరీల కింద ప్రకాశం జిల్లా గుండమలకు మూడో ర్యాంకు దక్కింది. నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ్ పంచాయతీ సతాత్ వికాస్ పురస్కార్ కేటగిరీ కింద మండల స్థాయిలో చిత్తూరు జిల్లా కుప్పం మండలానికి అవార్డు దక్కింది. కాగా, కూటమి పాలనలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మొత్తం 19 అవార్డులను దక్కించుకుంది.

## దళిత హక్కులు శతశాతం అమలు చేయాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** దళిత వర్గాల హక్కులను శతశాతం అమలు చేసి, వారి ఆర్థికాభివృ ద్ధికి సహకారం అందించాలని అధికార వర్గాలకు రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు రావాడ సీతారాం సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్యాల యంలో విధులు నిర్వహిస్తున్న దళిత ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల హక్కులను పూర్తిగా అమలు చేయా ల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రిజర్వేషన్ల ప్రాతిపదికన నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలను కల్పించాలన్నారు. ఉత్తరాంధ్రా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు త్వరలో విస్తృత పర్యటనలు చేపడ తామని చెప్పారు. వివిధ శాఖల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఎస్సీ సొసైటీకి 22శాతం రిజర్వేషన్ ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించా రు. దళిత ఉద్యోగుల నుంచి వచ్చిన వినతులను 15 రోజుల్లోగా పరిష్కరించి, తనకు నివేదికను పంపాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ బాలరాజు, సహాయ కమిష నర్ అప్పలరాజు, డీఎంహెచ్‌వో జీవన్‌రాణి, డీసీహెచ్ పద్మశ్రీ పాల్గొన్నారు.

## గంజాయి నిర్మూలనకు చర్యలు




**పార్వతీపరం, పతాకం న్యూస్:** జిల్లాలో గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి ఆదేశించారు. తన కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన గంజాయి కేసులు, వాటి పురోగతిపై చర్చించారు. గంజాయి కేసుల్లో నిందితులను త్వరగతిన అరెస్ట్ చేయాలని, పరారీలో ఉన్న వారి ఆచూకీ కనిపెట్టేందుకు సాంకేతికతను ఉపయోగించాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను పంపించాలని సూచించారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను, గంజాయిని న్యాయమూర్తుల సమక్షంలో ఇన్వెంటరీ చేయించాలని ఆదేశించారు. నిర్దిష్ట సమ యంలో కోర్టుల్లో అభియోగ పత్రాలు, చార్జి షీట్స్ దాఖలు చేయాలని తెలిపారు. గంజాయి వ్యాపారుల ఆస్తులను జప్తు చేయాలన్నారు. గంజాయి సేవించే వారిని కౌన్సిలింగ్ ఇవ్వాలని, వారి ద్వారా గంజాయి సరఫరా అయ్యే మార్గాలు, మూలాలు కనిపెట్టాలని దిశానిర్దేశం చేశారు. సంకల్పం , చైతన్యం, అభ్యుదయం 2.0 కార్యక్రమాల ద్వారా మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను యువతకు తెలియజేయాలని సూచించారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో పార్వతీపురం ఏఎస్పీ మనీషారెడ్డి, డీఎస్పీ రాంబాబు, సీఐలు తదితరులు పాల్గొన్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులు, యువత, చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ మాధవరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. చెరువు, కుంటలు, కాలువలు, నదుల్లో ఈతకు వెళ్లకుండా చూడాలన్నారు. ఈత రాని వారు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని తల్లితండ్రులు నిరంతరం వారిపై నిఘా ఉంచాలని సూచించారు.

## సోనియాగాంధీకి మళ్లీ అస్వస్థత.. ఆసుపత్రికి తరలింపు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ సోనియాగాంధీ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దీంతో గురుగ్రామ్‌లోని వేదాంత ఆసుపత్రికి ఆమెను తరలించారు. సోనియాగాంధీ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. ఆమె వెంట కుమార్తె ప్రియాంక, కుమారుడు రాహుల్ గాంధీ ఉన్నారు. ఇటీవల సోనియాగాంధీ తరచూ అస్వస్థతకు గురవుతున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది జనవరి, మార్చి మాసాల్లో ఆమె తీవ్ర ఆరోగ్యానికి గురయ్యారు. దీంతో సోనియాను వెంటనే ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆసుపత్రికి తరలించారు. కొన్ని రోజులపాటు చికిత్స అనంతరం ఆమెను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. మరికొన్ని సమయాల్లో స్వల్ప అస్వస్థతకు గురైతే.. ఆమెకు ఇంటి వద్దే వైద్యులు చికిత్స అందించిన విషయం విదితమే. ప్రస్తుతం సోనియాగాంధీ రాజ్యసభ సభ్యురాలిగా.. పార్టీ పార్లమెంటరీ బోర్డు చైర్ పర్సన్‌గా ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన ఫలితాలు



**పూసపాటిరేగ, పతాకం న్యూస్:** ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన ఫలితాలు వస్తున్నాయని డీఈవో మాణిక్యంనాయుడు అన్నారు. రెల్లివలస జడ్పీ హైస్కూల్‌లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ర్యాలీలో పాల్గొన్నారు. ఈసందర్భంగా 1 నుంచి 6 తరగతుల్లో 33 మంది విద్యార్థులకు పాఠ శాలల్లో ప్రవేశం కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి.శంకరావు, ఎంఈవోలు రాజ్ కుమార్, పాపినాయుడు, సర్పంచ్ ఇజ్జరోతు ఈశ్వర రావు, అప్పలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రెండు కార్లు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు



**పూసపాటిరేగ, పతాకం న్యూస్:** మండలంలోని షికారుగంజి జంక్షన్ వద్ద రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్టణం నుంచి పార్వతీపురం వైపు వెళు తున్న ఒక కారు, రామభద్రపురం నుంచి విజయనగరం వెళ్తున్న మరొక కారు ఎదురెదురుగా వస్తూ షికారుగంజి జంక్షన్ వద్ద బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు కార్లు నుజ్జునుజ్జు అయ్యాయి. ఈ ప్రమాదంలో పార్వతీపురం చర్చివీధికి చెందిన హనుమంతు జయరాజ్‌కు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో గజపతినగరం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని స్టేషన్ బూర్జివలస ఎస్ఐ జి.రాజేష్ పరిశీలించారు.

## వివాదంతో వెనక్కి తగ్గిన విజయ్ సర్కార్.. జ్యోతిష్యుడి నియామకం రద్దు




**చెన్నై, పతాకం న్యూస్:** తమిళనాడులో కొత్తగా కొలువుదీరిన ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తొలిరోజే తీవ్ర వివాదంలో చిక్కుకుంది. బుధవారం ఉదయం విశ్వాస పరీక్షలో నెగ్గిన వెంటనే, రాధన్ పండిట్ వెట్రివేల్ అనే జ్యోతిష్కుడిని ముఖ్యమంత్రికి ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (పొలిటికల్)గా నియమించడం పెను దుమారం రేపింది. మిత్రపక్షాలు, ప్రతిపక్షాల నుంచి వచ్చిన తీవ్ర వ్యతిరేకతతో ప్రభుత్వం కొన్ని గంటల్లోనే ఆ నియామకాన్ని వెనక్కి తీసుకుంది. విశ్వాస పరీక్ష సందర్భంగా అసెంబ్లీలో మాట్లాడిన డీఎండీకే చీఫ్ ప్రేమలత విజయకాంత్, ఈ నియామకాన్ని తీవ్రంగా ఖండించారు. "ముఖ్యమంత్రి ఓఎస్డీగా ఒక జ్యోతిష్కుడిని నియమించడాన్ని నేను ఖండిస్తున్నాను. దీని ద్వారా యువతకు ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటున్నారు? ఆయన మీ వ్యక్తిగత జ్యోతిష్కుడైతే, వ్యక్తిగతంగానే ఉంచుకోవాలి" అని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి మద్దతిస్తున్న కీలక మిత్రపక్షాలైన విడుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే), కాంగ్రెస్ కూడా ఈ నిర్ణయంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. "ఇది ఒక లౌకిక ప్రభుత్వంలో ఆమోదయోగ్యం కాదు. ప్రజలలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ప్రభుత్వ కర్తవ్యం" అని వీసీకే ప్రధాన కార్యదర్శి డి. రవికుమార్ పేర్కొంటూ, వెంటనే అతడిని తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్ కూడా.. "ఒక జ్యోతిష్కుడికి ఓఎస్డీ పదవి ఎందుకు అవసరం?" అని సోషల్ మీడియాలో ప్రశ్నించారు.

# కేజీబీవీలపై పెరుగుతున్న ఆసక్తి




**విజయనగరం, పతాకం న్యూస్:** పేద, సామాన్య బాలికల కోసం ప్రభుత్వం కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు (కేజీబీవీ)లను ఏర్పాటుచేసింది. తల్లిదండ్రులు లేని, వలసపోయిన వారి పిల్లలకు అక్కడ వసతితో కూడిన విద్య అందించేందుకు 2008లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ పాఠశాలలను ప్రారంభించాయి. జిల్లాలో 26 మండలాల్లో వీటిని ఏర్పాటు చేశారు. తొలుత 6 నుంచి పదో తరగతి వరకూ ఉన్న ఈ పాఠశాలను రెండు సంవత్సరాల కిందట ఇంటర్ కళాశాలలుగా పదోన్నతి కల్పించారు. సంప్రదాయం కోర్సులతో పాటు ప్రత్యేక సాంకేతిక కోర్సులను సైతం అందుబాటులోకి తెచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత విద్యాలయాల్లో వసతులు, సిబ్బంది నియామకంపై దృష్టిపెట్టింది. దీంతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయి.

జిల్లాలో 26 కేజీబీవీలు ఉన్నాయి. పదో తరగతిలో 94 శాతం ఉత్తీర్ణత నమోదు అయ్యింది. 500 మార్కులు పైబడి 229 మంది సాధించారు. 9 కేజీబీవీలు శతశాతం ఉత్తీర్ణతను నమోదుచేసుకున్నాయి. ఇంటర్ ఫలితాల్లో రామభద్రపురం, బాడంగి, బొండపల్లి, గంట్యాడ, ఎల్.కోట, నెల్లిమర్ల, వేపాడ, గుర్ల, వంగరలో శతశాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. మరో 10 కేజీబీవీలు ద్వితీయ సంవత్సరంలో శతశాతం ఉత్తీర్ణత నమోదుచేసుకున్నాయి. ఈ విద్యాలయాల్లో ఆరు నుంచి ఇంటర్ వరకూ ఇక్కడ విద్య అందిస్తున్నారు. ప్రతీ తరగతిలో 40 సీట్లు చొప్పున ఉంటాయి. తల్లిదండ్రులు లేని పిల్లలకు ప్రాధాన్యమిస్తారు. కంప్యూటర్ విద్యతో కూడిన ఉత్తమ విద్యాబోధన అందిస్తారు. సబ్జెక్టుల వారీగా మహిళా ఉపాధ్యాయులు (సీఆర్టీలు)ను నియమించారు. నిరంతర వైద్య సేవల కోసం ఒక ఏఎన్ఎం సైతం అందుబాటులో ఉంటుంది. బోధనేతర సిబ్బంది, చివరకు స్వీపర్లు, వాచ్‌మెన్ సైతం మహిళలే ఉంటారు. బాలికా రక్షణకు పెద్దపీట వేస్తూ ఏర్పాటుచేసిన ఈ పాఠశాలలను అవగాహన లేక కొందరు పేదలు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

కూటమి వచ్చిన తరువాత కేజీబీవీల్లో అన్నిరకాల సౌకర్యాలు మెరుగుపడ్డాయి. పౌష్టికాహారంతో పాటు అన్నిరకాల వసతులు అందుబాటులోకి తెచ్చారు. ప్రతిరోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం ఉంటుంది. మధ్యలో స్నాక్స్, బూస్టు, హార్లిక్స్, పాలు కూడా అందిస్తారు. వారంలో రోజుకో మెనూ ఉంటుంది. ఎంపిక చేసిన రోజుల్లో మాంసాహారం అందిస్తారు. కోడిగుడ్లు పెడతారు. స్నాక్స్‌లో బెల్లం చక్కీలు, వేరుశెనగ, గుడ్లు సైతం అందిస్తారు. రాత్రి భోజనం తరువాత పండ్లు, పాలు పెడతారు. యూనీఫాంతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు అందిస్తారు. కంప్యూటర్ బోధన, స్టైఫండ్, గ్రంథాలయ సేవలు, క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ప్రోత్సాహం, ఆత్మరక్షణకు కరాటే, ఆరోగ్యానికి యోగా సైతం నేర్పిస్తారు ఇక్కడ. బయట వ్యక్తులు లోపలికి ప్రవేశించకుండా అన్ని పాఠశాలలకు ప్రహరీలు నిర్మించారు. సమగ్ర శిక్ష అభియాన్ పరిధిలో ఉండే ఈ పాఠశాలల్లో నిధుల ఖర్చు విషయంలో అవినీతి జరుగుతుందన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. పాఠశాలల నిర్వహణకుగాను ప్రత్యేకాధికారుల ఖాతాల్లో నిధులు ఉంటాయి. వాటిని తమ విచక్షణాధికారంతో ఖర్చు చేసుకునే వెసులబాటు ఉంది. ఈ అధికారాన్ని కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. వాస్తవానికి సీఆర్‌టీలు తప్పనిసరిగా పాఠశాలల్లోనే ఉండాలి. రోజుకొకరు చొప్పున రాత్రి విధులు నిర్వహించాలి. ప్రత్యేకాధికారి తప్పనిసరిగా పాఠశాలలోనే ఉండాలి. కానీ చాలా పాఠశాలల ప్రత్యేకాధికారులు, సీఆర్‌టీలు సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. సిబ్బంది స్థానికంగా ఉండాలన్న నిబంధన పక్కాగా అమలుచేయాల్సిన అవసరం ఉంది.

## పెట్రోల్, డీజిల్ లభ్యత, ధరలపై కేంద్రమంత్రి కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** రిటైల్ ఇంధన లభ్యతపై కేంద్రం భరోసా ఇచ్చింది. అయితే పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ అమ్మకాలపై చమురు మార్కెటింగ్ కంపెనీలు నష్టపోవడం పట్ల కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంక్షోభం ఎక్కువ కాలం కొనసాగితే ఆ భారాన్ని దేశీయ వినియోగదారులపై మోపే పరిస్థితి రావొచ్చని అభిప్రాయపడ్డారు. దేశంలో చమురు సరఫరాపై ఆందోళన వ్యక్తమవుతున్న క్రమంలో హర్దీప్ సింగ్ పూరి స్పందించారు. చమురు సరఫరాలో ఇబ్బందులేమీ లేవని హామీ ఇచ్చారు. దేశంలో తగినన్ని చమురు నిల్వలున్నాయని వెల్లడించారు. దేశంలో ప్రస్తుతం 69 రోజులకు సరిపడే క్రూడాయిల్, ఎల్ఎన్‌జీ నిల్వలు ఉన్నాయని అన్నారు. 45 రోజులకు సరిపడా ఎల్పీజీ స్టాక్ ఉందని స్పష్టం చేశారు. ఎల్పీజీ ఉత్పత్తిని దేశంలో గణనీయంగా పెంచినట్లు తెలిపారు. రోజుకు 35,000 టన్నుల నుంచి 50,000 టన్నుల వరకు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచామని అన్నారు. ప్రస్తుత పశ్చిమాసియా యుద్ధం వల్ల తలెత్తిన సంక్షోభాన్ని సమర్థవంతంగా, బాధ్యతగా ఎదుర్కొన్నామని అన్నారు. ప్రధాని మోదీ ఇచ్చిన సలహా ప్రజలను అప్రమత్తం చేయడానికేనని తెలిపారు. దేశంపై ఆర్థికభారం పడకుండా ఆయన ఈ సూచన చేశారని తెలిపారు.

## ఏపీకి 10, తెలంగాణకు 22 టీఎంసీలు

### కృష్ణా జలాలపై కేఆర్ఎంబీ కీలక నిర్ణయం



**హైదరాబాద్, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల తాగునీటి అవసరాల మేరకు శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి నీటి విడుదలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ, తెలంగాణ తాగునీటి అవసరాల కోసం శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి నీటి విడుదలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు పచ్చజెండా ఊపింది. ఆగస్టు 15 వరకు ఏపీకి 10 టీఎంసీలు, తెలంగాణకు సాగర్ నుంచి 16, శ్రీశైలం నుంచి 6 టీఎంసీలు వాడుకునేందుకు కేఆర్ఎంబీ అనుమతించింది. హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో ఈ మేరకు అంగీకారం కుదిరింది. సాగర్‌లో ఆగస్టు 15 వరకు ఏపీకి 10 టీఎంసీల నీటిని కేటాయించగా, తెలంగాణకు సాగర్ నుంచి 16 టీఎంసీలు, శ్రీశైలం నుంచి 6 టీఎంసీల చొప్పున మొత్తం 22 టీఎంసీలను వినియోగించుకునేందుకు కేఆర్ఎంబీ అనుమతించింది. సమావేశంలో కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీష్ కాంబోజ్, తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్ బాబు, ఏపీ జలవనరుల శాఖ ఈఎన్సీ నర్సింహమూర్తి పాల్గొన్నారు. సమావేశంలో తెలంగాణ అధికారులు ఏపీ ఇప్పటికే ఎక్కువ నీటిని వాడుకుందని ప్రస్తావించారు. సాగర్‌లో ఏపీకి 10 టీఎంసీలు పోగా మిగిలిన మొత్తం నీరు తమకే చెందుతుందని స్పష్టం చేశారు. అయితే తాగునీటి అవసరాల దృష్ట్యా ఇరు రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై సానుకూలంగా నిర్ణయం తీసుకున్నారు. త్రిసభ్య కమిటీ సమావేశం సాఫీగా సాగిందని ఏపీ ఈఎన్‌సీ నరసింహమూర్తి తెలిపారు. 'ఆగస్టు 15 వరకు ఏపీ నీటి అవసరాల కోసం 10 టీఎంసీలు, తెలంగాణకు శ్రీశైలం నుంచి 6, సాగర్ నుంచి 16 టీఎంసీలు వినియోగించుకోవచ్చు' అని ఆయన ప్రకటించారు. ఈ నెల 14న జరిగే బోర్డు సమావేశంలో మిగిలిన అంశాలపై చర్చిస్తామని పేర్కొన్నారు. సాగునీటి విడుదల, ఇన్‌ఫ్లోలపై అప్పుడు సమీక్షించనున్నారు.

## రైల్వే గేటుతో వాహనదారులు, ప్రయాణికుల అవస్థలు



**కర్నూలు, పతాకం న్యూస్:** పట్టణ నడిబొడ్డులో డోన్ – బనగానపల్లె మార్గంలో రైల్వే గేటు ఉంది. దీంతో రైలు వచ్చిన ప్రతిసారి ద్విచక్రవాహనాలు, ఆటో, బస్సులు నిలిచిపోతున్నాయి. గుంతకల్లు – నంద్యాల, గూడ్స్ రాకపోకలు కొనసాగుతూ ఉన్నాయి. అరగంటకు ఒకసారి రైలు వస్తుండటంతో రైల్వేగేట్ మూసివేస్తున్నారు. దీంతో ఇరువైపులా ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు, బస్సులు, ఆటోలు నిలిచిపోతున్నాయి. ఈ మార్గం కర్నూలు– బనగానపల్లె రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కర్నూలు వైపు నుంచి బనగానపల్లె, తాడిపత్రి, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, తిరుపతికి వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయంలో పలుమార్లు ప్రజా ప్రతినిధులు, రైల్లే అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టినా పట్టించుకోవడం లేదని వాహనదారులు, డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి వంతెనను నిర్మించాలని కోరుతున్నారు.

## నీట్ పేపర్ లీక్‌పై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆందోళన



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (ఎన్ఇఇటి–నీట్) ప్రశ్నాప్రతాలు లీకేజీ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) అఖిల భారత అధ్యక్షులు ఆదర్శ్ ఎం సాజి డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్‌తో బిజెపి డబుల్ ఇంజిన్ సర్కార్ చెలగాటమాడుతోందని విమర్శించారు. ఈ నెల 3న నిర్వహించివుండాల్సిన నీట్ యుజి -- 2026 పరీక్ష రద్దు చేసే స్థాయిలో ప్రశ్నాప్రతాలు లీకేజీ అవ్వడం దారుణమన్నారు. ఢిల్లీలోని కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. నిరంతరం కఠోర సాధన చేసి బిజెపి ప్రభుత్వాల నిర్లక్ష్యంతో తీవ్ర నష్టాన్ని చవిచూసిన నీట్ అభ్యర్థులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) తగిన నష్ట పరిహారం చెల్లించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించి దుండగలను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ మేరకు ప్లకార్డులు చేబూని నినాదాలు హోరెత్తించారు. అయితే శాంతియుతంగా చేపట్టిన ఈ ఆందోళనపై ఢిల్లీ పోలీసులు క్రౌర్యాన్ని ప్రదర్శించారు. యువతీ, యువకులను, విద్యార్థి సంఘం నాయకులను రోడ్డు మీదనే ఈడ్చుకుంటూ తీసుకెళ్లి పోలీసు వ్యానుల్లోకి విసిరిపడేశారు. అరెస్టు చేసినట్లు ప్రకటించి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నేత సాజి మాట్లాడుతూ నీట్ పరీక్షలను ఎన్‌టిఎకు అప్పజెప్పిననాటి నుంచి పరీక్షల నిర్వహణలో అవకతవకలు వెలుగుచూస్తూనేవున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్‌టిఎ అసమర్థత మరోమారు బయటపడిందన్నారు. తాజా వ్యవహారంలో మొత్తం 720 మార్కులకు గాను దాదాపు 600 మార్కులు తారుమారు చేశారని, ఇది పరీక్ష సమగ్రతను తీవ్రంగా దెబ్బతీసిందనన్నారు. పరీక్షలోని 180 ప్రశ్నలలో దాదాపు 15 ప్రశ్నలు ఒక నమూనా ప్రశ్నపత్రంతో ముందుగానే పంపిణీ చేశారని తెలిపారు. రసాయనశాస్త్రం విభాగం నుండి సుమారు 120 ప్రశ్నలు యథాతథంగా లీక్ అయ్యాయని పేర్కొన్నారు. ఈ కుంభకోణానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వమే నేరుగా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. విద్యా రంగ కేంద్రీకరణ వంటి కేంద్ర ప్రభుత్వ వినాశకర విధానాల వల్ల దేశంలో అనేక ప్రాంతాల్లో అనేక పరీక్షలకు సంబంధించి మాఫియాలు పుట్టుకొస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది భారీ స్థాయిలో ప్రవేశ పరీక్షల కోచింగ్ మార్కెట్‌ను కూడా ప్రోత్సహించి, నిస్సహాయ స్థితిలో ఉన్న దేశ మధ్యతరగతి ప్రజల దోపిడీకి మార్గం సుగమం చేసిందన్నారు. ఎన్‌టిఎ అసమర్థత కారణంగా విద్యార్థులు పెద్ద మొత్తంలో నష్టాలపాలయ్యారని, వారి కఠోర సాధన వృథా అయిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నష్టం పూడ్చలేనిదని, ఎన్‌టిఎయే సముచిత స్థాయిలో నష్ట పరిహారం చెల్లించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పరీక్షలకు సంబంధించి అనుసరిస్తున్న అశాస్త్రీయ, అసమర్థ కేంద్రీకరణ ప్రయత్నాలను విరమించుకోవాలని, ఎన్‌టిఎను రద్దు చేసిన పోటీ పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని కోరారు. ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసిన విద్యార్థులును, విద్యార్థి సంఘం నాయకులను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ డిమాండ్ చేసింది. నీట్ ప్రశ్నాప్రతం లీకేజీపై విద్యా మంత్రిత్వశాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తుండగా 25 మందికి పైగా ఎస్ఎఫ్ఐ నేతలను, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య ప్రకటన విడుదల చేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు ఆదర్శ్ ఎం సాజి, అఖిల భారత సంయుక్త కార్యదర్శి ఐషీ ఘోష్, ఎస్ఎఫ్ఐ ఢిల్లీ రాష్ట్ర అధ్యక్షులు సూరజ్ ఎలామన్ తో పాటు పలువురు కార్యకర్తలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎన్‌టిఎ అసమర్థత పదేపదే బయటపడుతోందన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టుగా లేదన్నారు. కోచింగ్ మాఫియాకు, ప్రభుత్వ ఏజెన్సీకి మధ్య ఉన్న సంబంధాన్ని ప్రస్తుత నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీతో మరోమారు బహిర్గతం అయిందన్నారు. విద్యార్థిలోకం ఈ దుర్మార్గాన్ని చూస్తూ ఊరుకోదన్నారు. ఎన్ఐటికి వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ తన ఉద్యమాన్ని కొనసాగిస్తుందన్నారు.

## పట్టణ సుందరీకరణే లక్ష్యం

**పార్వతీపురం, పతాకం న్యూస్:** పార్వతీపురం సుందరీకరణే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. పట్టణంలో ఫ్లైఓవర్‌పై ఏర్పాటు చేసిన మొక్కలు, గోడలకు వేసిన పెయింటింగ్స్, పలు చిత్రాలను పరిశీలించారు. సుందరీకరణలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులు ప్రజలకు మెరుగైన వాతావరణాన్ని అందించడంతో పాటు పార్వతీపురానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని అన్నారు. మొక్కల సంరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. మొక్కల కుండీలకు ఆకర్షణీయమైన రంగులు వేయాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ డి.పావని, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నీట్ యూజీ 2026 పరీక్ష రద్దు..




**పాడేరు, పతాకం న్యూస్:** మెడికల్ సీటు సాధించాలనే లక్షలాది మంది విద్యార్థు-ల కష్టం వృదా అయిపోయింది. డబుల్ ఇంజన్ సర్కార్ నిర్లక్ష్యంతో వారి భవిష్యత్తు అగమ్యగోచరమైపోయింది. వైద్య విద్యకు సంబంధించిన మే 3న జరిగిన జాతీయ అర్హతా పరీక్ష (నీట్–యూజీ 2026)ను రద్దు చేస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ప్రకటించింది. ప్రశ్నా పత్రం లీకేజీ, అక్రమాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. పరీక్షను ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామని తెలిపింది. దీంతో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపట్టారు. మెడిసిన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా ( నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్) నీట్ యుజి -- 2026 పరీక్ష నిర్వహించారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 552 నగరాలు, 14 అంతర్జాతీయ కేంద్రాల్లో కలిపి సుమారు 22 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఆ సమయంలో జిపిఎస్ ట్రాకింగ్, బయోమెట్రిక్ వెరిఫికేషన్, ఎఐ నిఘా, 5జి జామ్మర్లు వంటి భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఎన్ టిఎ ఆర్భాటంగా ప్రకటించింది.. ?అయితే , పరిక్ష అనంతరం సోషల్ మీడియాలో రాజస్థాన్‌లో పరీక్షకు ముందే చలామణి అయిన గెస్ పేపర్ అసలు పరీక్షా పత్రంతో అచ్చుగుద్దినట్లు సరిపోలింది. ఈ విషయాన్ని విద్యార్థులు, కోచింగ్ సెంటర్లు గుర్తిం చాయి. దీనిపై ఒక్కసారిగా విద్యార్థులు ఫిర్యాదులు చేయడం ప్రారంభించారు. ఈ ఫిర్యాదులు తీవ్రమవ్వడంతో మే 7న ఎన్ టిఎ స్పందించింది. రాజస్థాన్, ఉత్తరాఖండ్ నుంచి అందిన సమాచారం ఆధారంగా మే 8న ఈ కేసును స్వతంత్ర విచారణ కోసం కేంద్ర ఏజెన్సీలకు అప్పగించింది. మే 10న రాజస్థాన్ పోలీసుల స్పెషల్ ఆపరేషన్స్ ననగ్రూప్ (ఎస్‌ఒజి) ఈ అక్రమాలపై బహిరంగంగా విచారణ ప్రారంభించడంతో పరిస్థితి మరింత ముదిరింది. పరీక్షకు ముందు సుమారు 400 ప్రశ్నలు సర్క్యులేట్ అయ్యాయని, అందులో బయాలజీ, కెమిస్ట్రీకి చెందిన 100కి పైగా ప్రశ్నలు అసలు పేపర్‌లోని ప్రశ్నలతో సరిపోలుతున్నాయని ఎడిజిపి విశాల్ బన్సాల్ వెల్లడించారు. మే 11 నాటికి ఈ వివాదం పతాక స్థాయికి చేరింది. అసలు పేపర్‌లోని 180 ప్రశ్నలకు గానూ.. ఏకంగా 135 ప్రశ్నలు (90 బయాలజీ, 45 కెమిస్ట్రీ) ఆ గెస్ పేపర్‌లో ఉన్నాయని ప్రచారం జరగటంతో దేశవ్యాప్తంగా ఆందోళన మొదలైంది. అయితే బిజిపి ఏలుబడిలోని రాజస్తాన్ ప్రభుత్వం పరీక్ష నిర్వహనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శలు వెల్లువెత్తాయి. వీటిని ఒక రోజు ముందు 5 లక్షలకు, పరీక్షకు గంట ముందు 30 వేలకు అమ్మకాలు జరిగాయని పలువురు తెలిపారు.

## ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించండి



**తిరుపతి, పతాకం న్యూస్:** తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ అన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పెనగలూరు మండలంలో జిల్లా విద్యాశాఖ అధికారి కేవిఎన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన బడి పిలుస్తుంది కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడి పిలుస్తోంది కార్యక్రమం ద్వారా మన సంకల్పం -విద్యా ప్రగతి' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు విద్యార్థులకు అవగాహన కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాణ్యమైన డిజిటల్ విద్య,ఉచిత పాఠ్య పుస్తకాలు,యూనిఫామ్, మధ్యాహ్న భోజనం తదితర వసతులను కల్పిస్తున్నారని అన్నారు.అనంతరం పదవ తరగతిలో 2026వ విద్యా సంవత్సరంలో అత్యధిక మార్పులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభా పురస్కార అవార్డులను అందజేశారు.ఈ కార్యక్రమానికి యువనేత ముక్కా సాయి వికాస్ రెడ్డి,తాతంశెట్టి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కస్టమ్స్ డ్యూటీ పెంపు.. బంగారం, వెండి మరింత ప్రియం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని కేంద్రం తాజాగా పెంచింది. బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 10 శాతానికి, అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్‌ను 5 శాతానికి పెంచింది. దీంతో, మొత్తం దిగుమతుల సుంకం 15 శాతానికి చేరింది. గతంలో ఇది 6 శాతంగా ఉండేది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో 95.75కి పతనమైన నేపథ్యంలో అప్రమత్తమైన ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని పెంచింది. బంగారం వినియోగంలో భారత్ ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్న విషయం తెలిసిందే. వెండి వినియోగంలో ప్రథమ స్థానంలో ఉంది. దేశీయ అవసరాల కోసం భారత్ ఎక్కువగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇక ఈక్విటీ మార్కెట్‌లో రాబడులు మందగించిన నేపథ్యంలో గతేడాది భారత్‌లో బంగారానికి డిమాండ్ పెరిగింది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ నివేదిక ప్రకారం, ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంలో గోల్డ్ ఆధారిత ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లో పెట్టుబడులు గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 186 శాతం మేర పెరిగాయి.

## కనీస వేతనం అమలు కోరుతూ కేంద్రకార్మిక సంఘాల ధర్నా





**తిరుపతి, పతాకం న్యూస్:** ఏ రంగంలో పనిచేసే కార్మికునికైనా కనీస వేతనం 26వేలు చెల్లించాలని, నోయిడా కార్మికులపై యోగి ప్రభుత్వ నిర్బంధాన్ని ఆపాలని, నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, స్కిం వర్కర్లు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కాకినాడ కలక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె వెంకటేశ్వరులు, ఐఎన్టియుసి ఏపీ, తెలంగాణా ఆర్గనైజింగ్ సెక్రెటరీ తాళ్లూరి రాజు మాట్లాడారు. నోయిడా కార్మికులపై యోగి ప్రభుత్వం అక్రమ నిర్బంధాలకు పాల్పడుతూ 520 మంది కార్మికులపై తప్పుడు కేసులు బనాయించి అరాచకత్వానికి పాల్పడుతుందని విమర్శించారు. కనీస వేతనాలు అమలు చేయని నోయిడా పారిశ్రామిక యాజమాన్యాలపై ఏ చర్యలు తీసుకోకుండా తన వర్గ స్వభావాన్ని మోడీ ప్రభుత్వం బయట పెట్టుకుందన్నారు. గత 15 ఏళ్ల నుండి కార్మిక వర్గం పెట్టిన డిమాండ్లలో ఏ ఒక్కటి మోడీ ప్రభుత్వం పరిష్కరించలేదని, ఫిబ్రవరి 12న కార్మికవర్గం సమ్మెతో తమ నిరసనను తెలియజేసినా 4 లేబర్ కోడ్లు అమలులోకి తీసుకురావడం ద్వారా బడా కార్పొరేట్ల పక్షాన మోడీ బీజేపీ ప్రభుత్వం నిస్సిగ్గుగా పనిచేయడాన్ని కార్మికులు గమనించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో యుపి కార్మికుల స్థితిగతులకు భిన్నంగా ఏమీ లేదని, మన రాష్ట్రంలో కూడా కనీస వేతనాన్ని సవరించి 15 ఏళ్లు గడుస్తుందని, ఇప్పటికీ 2011 ధరల ప్రకారమే పారిశ్రామిక కార్మికులకు షెడ్యూల్ పరిశ్రమల్లో వేతనాలు అమలు జరుగుతున్నాయని, తక్షణం ధరలకు అనుగుణంగా రాష్ట్రంలో కూడా కనీస వేతనం 26వేలు ఇచ్చేలా సవరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి మలకా రమణ, రొంగల ఈశ్వరరావు, వర్కింగ్ కమిటీ సభ్యులు పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, నాగ బత్తుల సూర్యనారాయణ, ఏఐటియుసి సెక్యూరిటీ కార్డు యూనియన్ రామయ్య, ఐఎన్టీయుసి నాయకులు బొగ్గుల అశోక్ కుమార్, బి రామకృష్ణ, వివి రమణ, టీఏఎస్ కుమారి, విజయ్, ఐఎఫ్టియు రాష్ట్ర కోశాధికారి గుబ్బల ఆదినారాయణమూర్తి. రాగుల రాఘువులు, పెండ్యాల రాము, ఎర్రంశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బతో ఉపాధి కార్మికుడు మృతి

**గజపతినగరం, పతాకం న్యూస్:** వడదెబ్బతో ఉపాధి కార్మికుడు మృతిచెందిన ఘటన విజయనగరం జిల్లాలో చోటుచేసుకుంది. గజపతినగరం మండలంలో గంగచోళ్లపెంట గ్రామంలోని చెరువు వద్ద అదే గ్రామానికి చెందిన గుదే సత్యం (60) ఉదయం ఎనిమిది గంటలకు చెరువు పనికి వెళ్లారు. ఎండ తీవ్రతతో వడదెబ్బకు గురై చెరువు వద్దే కుప్పకూలిపోయారు. తోటి కార్మికులు సపర్యలు చేసినా ఫలితం లేదు. ఉపాధి ఎపిఒ కృష్ణవేణికి, గ్రామ పెద్దలతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

# జీఎల్‌పీ-1 మందులు అందరికీ ఒకే విధంగా ఎందుకు పని చేయవు?




బరువు తగ్గేందుకు ఉపయోగించే ఒజెంపిక్, మొంజారో వంటి మందులు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన ఆదరణ పొందుతున్నాయి. టైప్-2 డయాబెటిస్ చికిత్స కోసం రూపొందించిన ఈ ఔషధాలను చాలామంది బరువు తగ్గడానికి కూడా ఉపయోగిస్తున్నారు. అయితే అందరికీ ఇవి ఒకే విధంగా పనిచేయవు. కొందరు ఈ మందులతో శరీర బరువులో 20 శాతం వరకు తగ్గుదల చూస్తుంటే, మరి కొందరికి మాత్రం తక్కువ ఫలితాలే కనిపిస్తున్నాయి. ఈ తేడాకు కారణం జన్యువులే కావచ్చని తాజా అధ్యయనం వెల్లడించింది. తాజాగా నిర్వహించిన పరిశోధనలో, ఈ మందులకు శరీరం ఎలా స్పందిస్తుందో వ్యక్తుల జన్యువులు ప్రభావితం చేస్తున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. దాదాపు 28 వేల మంది రోగుల డీఎన్ఏ నమూనాలను పరిశీలించిన పరిశోధకులు, కొన్ని ప్రత్యేక జన్యు మార్పులు ఉన్నవారిలో బరువు తగ్గడం ఎక్కువగా జరిగిందని గుర్తించారు. మరికొంతమందిలో మాత్రం వికారం, వాంతులు వంటి దుష్ప్రభావాలు ఎక్కువగా కనిపించాయని వెల్లడించారు. ఈ అధ్యయనం నేచర్ జర్నల్‌లో ప్రచురితమైంది. ఒజెంపిక్, వెగోవీ మందుల్లో సెమాగ్లూటైడ్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శరీరంలో భోజనం చేసిన తర్వాత విడుదలయ్యే జీఎల్‌పీ-1 హార్మోన్‌లా పనిచేస్తుంది. ఈ హార్మోన్ మెదడుకు కడుపు నిండిన సంకేతాన్ని పంపుతుంది. ఫలితంగా ఆకలి తగ్గి, తక్కువ ఆహారం తీసుకోవడం ద్వారా బరువు తగ్గడం సాధ్యమవుతుంది. సాధారణంగా ఈ మందులతో 10 శాతం వరకు బరువు తగ్గవచ్చని చెబు తున్నప్పటికీ, ఫలితాలు వ్యక్తి వ్యక్తికీ భిన్నంగా ఉంటున్నాయి. పరిశోధకులు నిర్వహించిన జీనోమ్-వైడ్ అసోసియేషన్ స్టడీలో జీఎల్‌పీ1ఆర్ అనే జన్యువులో ఉన్న ఒక ప్రత్యేక మార్పు ఉన్నవారిలో బరువు తగ్గుదల మరింత ఎక్కువగా కనిపించిందని గుర్తించారు. ఈ జన్యు మార్పు ఉన్నవారిలో మందులు శరీరంపై బలంగా పనిచేసి ఆకలిని ఎక్కువగా తగ్గిస్తున్నాయని తెలిపారు. మరోవైపు, కొందరిలో మందులు సరిగా పనిచేయకపోవడానికి కారణం జన్యువుల వల్ల రిసెప్టర్లు మందులను తక్కువగా స్వీకరించడమేనని వివరించారు. అలాగే జీఐపీఆర్ సంబంధిత జన్యువుల్లో మార్పులు ఉన్నవారిలో మొంజారో వాడినప్పుడు వికారం, వాంతులు వంటి సమస్యలు ఎక్కువగా కనిపించినట్లు అధ్యయనం తెలిపింది. అయితే ఈ జన్యు మార్పులు బరువు తగ్గుదలపై మాత్రం ప్రభావం చూపలేదని పరిశోధకులు పేర్కొన్నారు.

నిపుణుల ప్రకారం, మన డీఎన్ఏ ఆకలి, కొవ్వు నిల్వలు, మెటబాలిజం వంటి అనేక అంశాలను ప్రభావితం చేస్తుంది. అందువల్లే కొందరు మందులకు త్వరగా స్పందిస్తే, మరికొందరిలో ప్రభావం తక్కువగా కనిపిస్తుంది. అయితే ఆహారపు అలవాట్లు, వ్యాయామం, జీవనశైలి కూడా కీలక పాత్ర పోషిస్తాయని వారు గుర్తుచేస్తున్నారు. జన్యువులు కేవలం 5 నుంచి 10 శాతం వరకు మాత్రమే ప్రభావం చూపుతాయని అంచనా వేస్తున్నారు. ఈ పరిశోధన భవిష్యత్తులో వ్యక్తిగత జన్యువుల ఆధారంగా బరువు తగ్గించే చికిత్సలు అందించే అవకాశాలకు మార్గం చూపుతోంది. భవిష్యత్తులో సాధారణ జన్యు పరీక్షల ద్వారా ఏ మందు ఎవరికి బాగా పనిచేస్తుందో ముందుగానే తెలుసుకునే అవకాశం ఉండవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దీని వల్ల సరైన మందును ఎంపిక చేయడం, దుష్ప్రభావాలను తగ్గించడం, చికిత్స ఫలితాలను మెరుగుపరచడం సులభమవుతుందని చెబుతున్నారు.

# మన్యమంతటా మోగనున్న సెల్

## ఏజెన్సీ వ్యాప్తంగా 1,584 సెల్ టవర్ల నిర్మాణానికి చర్యలు



**పాడేరు, పతాకం న్యూస్:** మన్యంలో సమాచార వ్యవస్థపరంగా ఓ విప్లవాత్మకమైన మార్పు రానుంది. ఏజెన్సీలో సెల్ సేవల విస్తరణలో భాగంగా 1,584 సెల్ టవర్ల నిర్మాణానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 1,267 టవర్లు అందుబాటులోకి రాగా, మిగిలిన 317 టవర్లు వివిధ దశల్లో ఉన్నాయి. ఆయా పనులు లక్ష్యం మేరకు పూర్తయితే మరో ఏడాది కాలంలో ఏజెన్సీలో మారుమూల ప్రాంతంలో సైతం సెల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఏజెన్సీ 11 మండలాల్లో 244 గ్రామ పంచాయతీల పరిధిలో 3,803 గిరిజన పల్లెలున్నాయి. వాటిలో 1,150 గ్రామాలకు సెల్ కనెక్టవిటీ ఉండగా, మిగిలిన 2,653 గ్రామాలకు ఎటువంటి సెల్ సేవలు అందుబాటులో లేవు. కాగా 2021లో అప్పటి ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ మన్యంలోని గ్రామాలకు రోడ్డు, రవాణా, సెల్, తాగునీరు, విద్యుత్ తదితర 42 రకాల సదుపాయాలపై ఒక ప్రత్యేక కార్యాచరణ రూపొందించి వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సర్వే చేయించారు. ఆ సర్వే ఆధారంగా ఏజెన్సీలో ప్రతి పల్లెలో ఉన్న సదుపాయాలు, ఇంకా కల్పించాల్సిన సౌకర్యాలపై సమగ్ర నివేదికను రూపొందించారు. దాని ఆధారంగా ఏజెన్సీ వ్యాప్తంగా ఉన్న గిరిజన పల్లెలకు రోడ్డు, సెల్ కనెక్టవిటీ, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో అప్పట్లో 'మిషన్ కనెక్ట్ పాడేరు' పేరిట వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు. మన్యంలో సదుపాయాలపై జరిగిన సర్వేలో ఏజెన్సీ వ్యాప్తంగా 2021లో చేపట్టిన సర్వే ఆధారంగా కేవలం 30 శాతం గ్రామాలకు మాత్రమే సెల్ సేవలు అందుబాటులో ఉన్నాయని గుర్తించారు. అనంతగిరి మండలంలో 27 శాతం, అరకులోయలో 40, డుంబ్రిగుడలో 22, హుకుంపేటలో 39, ముంచంగిపుట్టులో 23, పెదబయలులో 14, చింతపల్లిలో 55, జీకేవీధిలో 9, జి.మాడుగులలో 32, కొయ్యూరులో 36, పాడేరు మండలంలో 42 శాతం గ్రామాలకు మాత్రమే సెల్ సేవలు అందుబాటులో ఉన్నాయి. దీంతో 'మిషన్ కనెక్ట్ పాడేరు'లో భాగంగా ఏజెన్సీలో అధిక సంఖ్యలో సెల్ టవర్ల ఏర్పాటుకు కృషి చేయాలని 2021లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ నిర్ణయించుకున్నారు. అందుకు గాను వివిధ సెల్ నెట్‌వర్క్ కంపెనీలతో చర్చలు, సమావేశాలు నిర్వహించి, ఊహించని విధంగా ఫలితాన్ని సాధించారు. ఏజెన్సీ వ్యాప్తంగా ఇప్పటి వరకు బీఎస్ఎన్ఎల్ 62, జియో 73.. మొత్తం 135 సెల్ టవర్లు మాత్రమే ఉన్నాయి. కలెక్టర్, ఐటీడీఏ పీవో కృషితో ఏజెన్సీకి మొత్తం 1,584 సెల్ టవర్లు ఒకేసారి మంజూరు కావడం విశేషం. దీంతో ఏజెన్సీ వ్యాప్తంగా 936 బీఎస్ఎన్ఎల్, 509 జియో, 139 ఎయిర్‌టెల్ సెల్ టవర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. గత నాలుగేళ్లుగా ఏజెన్సీ వ్యాప్తంగా సెల్ టవర్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. తాజా లెక్కల ప్రకారం మొత్తం 1,584 టవర్లకు గాను ఇప్పటికే 1,267 టవర్ల నిర్మాణం పూర్తికాగా, మిగిలిన 317 టవర్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మరో ఏడాదిలో దాదాపుగా అన్ని టవర్ల నిర్మాణం పూర్తయితే లక్ష్యం మేరకు మారుమూల పల్లెలకు సైతం సెల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఏజెన్సీలో సెల్ టవర్ల నిర్మాణంలో ఆశించిన స్థాయిలో వేగం పుంజుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి గత మూడేళ్లుగా నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ, పూర్తి స్థాయిలో అన్ని టవర్ల నిర్మాణానికి ఇంకా మరో ఏడాది పైబడి సమయం పట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ అంశంపై ప్రతీ వారం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదనే వాదన బలంగా వినిపిస్తున్నది. ప్రస్తుతం ప్రతి ప్రభుత్వ పథ?కానికి సంబంధించిన అంశాలు జాతీయ ఉపాధి హామీ పథకం శ్రామికుల హాజరు సైతం ఆన్‌లైన్‌లోనే నమోదు చేయాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ఏజెన్సీలో సెల్ టవర్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మన్యం వాసులు కోరుతున్నారు.

## 22 లక్షల మంది విద్యార్థుల కష్టాన్ని, కలలను ఛిన్నాభిన్నం చేశారు: రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** వైద్య విద్య జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష(నీట్-యూజీ) 2026కు సంబంధించిన ప్రశ్నాపత్రం లీకైనట్లు వచ్చిన వార్తలపై లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. దాదాపు 22 లక్షలమంది నీట్ పరీక్షను రాశారని గుర్తు చేశారు. ఆ విద్యార్థులు పడిన కష్టాన్ని, వారి కలలను బీజేపీ సారథ్యంలోని అవినీతి వ్యవస్థ ఛిన్నాభిన్నం చేసిందని ఆయన 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. నీట్ పరీక్ష రద్దయిందని, దీంతో లక్షలాది మంది విద్యార్థుల కఠోర శ్రమ, త్యాగాలు, కలలు చిన్నాభిన్నమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల కోసం కొందరి తండ్రులు రుణాలు తీసుకున్నారని, మరికొందరి తల్లులు బంగారం అమ్మేశారని పేర్కొన్నారు. లక్షలాది మంది విద్యార్థులు ఎన్నో నిద్రలేని రాత్రులు కష్టపడి చదివితే, వారికి దక్కిన ప్రతిఫలం 'పేపర్ లీకేజీ-పరీక్ష రద్దు' అని ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా వ్యవస్థలో వ్యవస్థీకృతమైన అవినీతి పేపర్ లీకేజీకి నిదర్శనమని మండిపడ్డారు. ఇది కేవలం వైఫల్యం కాదని, యువత భవిష్యత్తుపై జరిగిన నేరమని విమర్శించారు. ప్రతిసారి పేపర్ మాఫియా ఎలాంటి శిక్ష లేకుండా తప్పించుకుంటోందని అన్నారు. కానీ విద్యార్థులు శిక్ష అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష లీకేజీ కారణంగా విద్యార్థులు మరోసారి అదే మానసిక ఒత్తిడి, ఆర్థికపరమైన భారం, అస్థిరతను భరించాల్సి వస్తోందని అన్నారు. ప్రధాని మోదీ చెబుతోన్న అమృత్ కాలం దేశానికి విషమయంగా మారిందని అన్నారు.

## పుదుచ్చేరిని సింగపూర్‌లా చేస్తా: సీఎం రంగస్వామి

**పుదుచ్చేరి:** ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం మీడియాతో రంగస్వామి మాట్లాడారు. ఎన్డీయే కూటమికి మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిపై మరింతగా దృష్టి సారిస్తుందని, ప్రజా సంక్షేమం కోసం అవసరమైన అన్ని పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పుదుచ్చేరిని ప్రధాన అభివృద్ధి, పర్యాటక కేంద్రంగా మార్చనున్నట్లు ఆయన తెలిపారు. పుదుచ్చేరిని సింగపూర్‌లా అభివృద్ధి చేయబోతున్నట్లు సీఎం రంగస్వామి ప్రకటించారు.




## ఐపీఎల్ 2026.. సాయి సుదర్శన్ అరుదైన రికార్డు



పీఎల్ 2026లో గుజరాత్ టైటాన్స్ జోరు కొనసాగుతోంది. వరుసగా ఐదో విజయంతో ప్లే ఆఫ్స్ స్థానాన్ని దాదాపుగా ఖాయం చేసుకుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఏకంగా 82 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 169 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్.. 86 పరుగులకే కుప్పకూలింది. సిరాజ్, రబాడా, హోల్డర్ విజృంభించిన వేళ.. స్వల్ప ఛేదనలో హైదరాబాద్ తేలిపోయింది. అయితే గుజరాత్ ఓపెనర్ సాయి సుదర్శన్(61) ఈ మ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో చెలరేగాడు. ఈ సీజన్‌లో 500కి పైగా పరుగులు చేసిన తొలి ప్లేయర్‌గా నిలిచాడు. ఈ నేపథ్యంలో సాయి సుదర్శన్ ఓ అరుదైన రికార్డు తన ఖాతాలో వేసుకున్నాడు. సన్‌రైజర్స్‌పై మ్యాచ్‌లో సాయి సుదర్శన్ 44 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 61 పరుగులు చేశాడు. ఈ సీజన్‌లో 500కి పైగా పరుగులు మార్క్‌ను అందుకున్న తొలి ప్లేయర్‌గా నిలిచాడు. ఐపీఎల్ చరిత్రలోనే 24 ఏళ్ల వయసులోపు మూడు వేర్వేరు సీజన్లలో 500 కంటే ఎక్కువ పరుగులు సాధించిన తొలి ప్లేయర్‌గా సాయి సుదర్శన్ రికార్డులకెక్కాడు. ఈ ఫీట్ ఇప్పటి వరకు ఎవరూ సాధించలేకపోయారు. ఇంతకుముందు ఆర్సీబీ స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ 24 ఏళ్ల వయసులోపు రెండు సీజన్లలో 500 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. అదేవిధంగా ఐపీఎల్ చరిత్రలో వరుసగా మూడు లేదా అంతకంటే ఎక్కువ సీజన్లలో 500కి పైగా పరుగులు సాధించిన నాలుగో ప్లేయర్‌గా సుదర్శన్ నిలిచాడు. ఈ జాబితాలో సుదర్శన్ కంటే ముందు డేవిడ్ వార్నర్(2014-2017), కేఎల్ రాహుల్(2018-2021), విరాట్ కోహ్లీ(2023-2025) ఉన్నారు. కాగా గుజరాత్ టైటాన్స్ జట్టు తరఫున మూడుసార్లు 500ం పరుగులు చేసిన తొలి ప్లేయర్ కూడా సుదర్శనే కావడం విశేషం. ఇదిలా ఉంటే, ఈ సీజన్‌లో 12 మ్యాచుల్లో ఎనిమిది విజయాలు సాధించిన జీటీ.. ఆర్సీబీని వెనక్కి నెట్టి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది.

## సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై

# గుజరాత్ టైటాన్స్ విజయం



పటిష్ఠ ప్రత్యర్థులను మట్టికరిపిస్తూ అదరగొడుతున్న గుజరాత్ టైటాన్స్ ప్లేఆఫ్స్ ముంగిట నిలిచింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో పేసర్లు అదరగొట్టిన వేళ.. 82 రన్స్ తేడాతో ఘన విజయం సాధించింది. గిల్‌సేనకిది వరుసగా ఐదో విజయం కాగా.. మొత్తం 16 పాయింట్లతో టేబుల్ టాపర్‌గా కొనసాగుతోంది. అటు భారీ స్కోర్లతో బెంబేలెత్తించే రైజర్స్ కనీసం వంద పరుగులు కూడా చేయలేక చతికిలపడింది. ఇక రైజర్స్ మిగిలిన రెండు మ్యాచ్‌లను కచ్చితంగా గెలవాల్సి ఉంటుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 168 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (44 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 61), సుందర్ (33 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 50) హాఫ్ సెంచరీలు సాధించారు. పేసర్లు ప్రఫుల్, సకీబ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో సన్‌రైజర్స్ 14.5 ఓవర్లలో 86 పరుగులకు కుప్పకూలింది. కమిన్స్ (19) టాప్ స్కోరర్. పేసర్లు హోల్డర్, రబాడలకు మూడేసి, ప్రసిద్ధ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రబాడ నిలిచాడు.

ఓ మాదిరి ఛేదనే అయినప్పటికీ సన్‌రైజర్స్ ఇన్నింగ్స్ పేకమేడను తలపించింది. పిచ్ బౌలర్లకు మరింతగా సహకరించడంతో భీకర బ్యాటింగ్ ఆర్డర్ కలిగిన రైజర్స్‌ను గుజరాత్ బౌలర్లు వణికించారు. తొలి ఓవర్ మెయిడిన్‌గా వేసిన పేసర్ సిరాజ్ ఓపెనర్ హెడ్ (0)ను అవుట్ చేశాడు. ఆ వెంటనే మరో ఓపెనర్ అభిషేక్ (6)ను రబాడ బౌల్డ్ చేయడంతో రైజర్స్ షాక్‌కు గురైంది. ఆ తర్వాత కూడా వరుస ఓవర్లలో ఇషాన్ కిషన్ (11), స్మరణ్ (9)లను రబాడ అవుట్ చేయడంతో పవర్‌ప్లేలో జట్టు 34/4 స్కోరుతో ఓటమి దిశగా సాగింది. సలీల్ అరోరా, క్లాసెన్‌ల మధ్య ఐదో వికెట్‌కు వచ్చిన 24 పరుగుల భాగస్వామ్యమే అత్యధికం కావడం గమనార్హం. ఈ ఇద్దరూ క్రీజులో ఉన్నప్పుడు రైజర్స్ పోటీలో ఉన్నట్టు కనిపించింది. కానీ హోల్డర్ 11వ ఓవర్‌లో క్లాసెన్, నితీశ్ (2) ఇద్దరినీ అవుట్ చేయడంతో ఎస్ఆర్‌హెచ్ ఆశలు గల్లంతయ్యాయి. చివర్లో కమిన్స్ కాసేపు క్రీజులో నిలువగలిగాడు.

పిచ్‌పై తేమను సద్వినియోగం చేసుకున్న సన్‌రైజర్స్ బౌలర్లు చెలరేగారు. దీంతో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ పవర్‌ప్లేలో చేసింది 34 పరుగులే కాగా, కెప్టెన్ గిల్ (5), బట్లర్ (7) వికెట్లను సైతం కోల్పోయింది. కానీ మరో ఓపెనర్ సాయి సుదర్శన్ పట్టు వదల్లేదు. నిషాంత్ సింధు (22) ఉన్నకాసేపు ఎదురుదాడికి దిగాడు. అయితే పదో ఓవర్‌లో పేసర్ కమిన్స్ అతడిని అవుట్ చేశాడు. 64/3 స్కోరుతో ఇబ్బందుల్లో పడిన జట్టును సాయితో కలిసి వాషింగ్టన్ సుందర్ గట్టెక్కించే ప్రయత్నం చేశాడు. ఈ జోడీ రైజర్స్ బౌలర్లను నిలకడగా ఎదుర్కొంటూనే అడపాదడపా బౌండరీలతో స్కోరును గాడిలో పెట్టే ప్రయత్నం చేసింది. అలాగే 38 బంతుల్లో సాయి సీజన్‌లో హ్యాట్రిక్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 17వ ఓవర్‌లో సాయిని పేసర్ సకీబ్ అవుట్ చేయడంతో నాలుగో వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక 19వ ఓవర్‌లో సుందర్ చెలరేగి 4,4,6తో 18 రన్స్ రాబట్టడంతో స్కోరు 150 దాటింది. చివరి ఓవర్‌లో అర్ధసెంచరీ చేశాక ఐదో బంతికి సుందర్ అవుటయ్యాడు. హోల్డర్ (11 నాటౌట్)తో కలిసి తను ఐదో వికెట్‌కు 40 పరుగులు జోడించాడు. ఆఖరి బంతిని తెవాటియా (4 నాటౌట్) ఫోర్‌గా మలచడంతో జీటీ 160ంతో సవాల్ విసిరే స్కోరందుకుంది.




## హాలీవుడ్ చిత్రంలో..
# దిశా పటానీ

దిశా పటానీ పేరు కూడా గట్టిగా వినిపిస్తోంది. ఈ అమ్మడు సోషల్ మీడియాలో కేవలం ఒక్క ఫోటో షేర్ చేస్తే చాలు, ఇంటర్నెట్ షేక్ అవ్వాల్సిందే..! ఫిట్‌నెస్‌కు కేరాఫ్ అడ్రస్‌గా, కుర్రకారు కలల రాకుమారిగా మారిన దిశా పటానీ ఇప్పుడు తన రూట్ మార్చింది. కేవలం బాలీవుడ్, సౌత్ సినిమాలతోనే సరిపెట్టుకోకుండా.. గ్లోబల్ వైడ్‌గా తన జెండా పాతేందుకు సిద్ధమైంది. ప్రియాంక చోప్రా, దీపికా పదుకొణె బాటలో నడుస్తూ హాలీవుడ్‌లో గ్రాండ్ ఎంట్రీకి ప్లాన్ చేస్తోంది.



లేటెస్ట్ సమాచారం ప్రకారం, దిశా పటానీ ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్ అనే హాలీవుడ్ చిత్రంలో ఒక కీలక పాత్రకు ఎంపికైంది. ఇది మామూలు సినిమా కాదు.. హై-వోల్టేజ్ యాక్షన్, సైన్స్ ఫిక్షన్ డ్రామాగా తెరకెక్కనుంది. దిశాకు మార్షల్ ఆర్ట్స్ మరియు జిమ్నాస్టిక్స్‌లో మంచి పట్టు ఉంది. అందుకే ఇలాంటి ఫిక్షన్ సినిమాలకు ఆమె పర్ఫెక్ట్ ఛాయిస్ అని హాలీవుడ్ మేకర్స్ భావిస్తున్నారట. తన ఇన్స్టాగ్రామ్ పోస్టులతో ఇప్పటికే ఇంటర్నేషనల్ బ్రాండ్ల దృష్టిని ఆకర్షించిన దిశా, ఈ సినిమాతో వెస్టర్న్ ఆడియన్స్‌కు మరింత చేరువ కానుంది. దిశాకు హాలీవుడ్ కొత్తేమీ కాదు. గతంలోనే జాకీచాన్ నటించిన కుంగ్ ఫూ యోగా చిత్రంలో అమ్మడు మెరిసింది. కానీ, దురదృష్టవశాత్తు ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో సక్సెస్ సాధించలేకపోయింది. దాంతో హాలీవుడ్ కలలను పక్కన పెట్టి మళ్ళీ బాలీవుడ్‌లోనే బిజీ అయిపోయింది. కల్కి 2898 ఏడీ వంటి భారీ ప్రాజెక్టులతో మన దగ్గర క్రేజ్ సంపాదించుకున్న దిశా, ఈసారి మాత్రం హాలీవుడ్‌లో గట్టిగా కొట్టాలని ఫిక్స్ అయింది. దిశా కేవలం గ్లామర్ మీద మాత్రమే ఆధార పడటం లేదు. ఆమె ఎంచుకుంటున్న కథలు, చేస్తున్న వర్కవుట్లు చూస్తుంటే హాలీవుడ్‌లో సెటిల్ అవ్వడానికి కావాల్సిన క్వాలిటీస్ అన్నీ ఆమెలో పుష్కలంగా ఉన్నాయి. కేవలం అందం ఉంటే సరిపోదు, హాలీవుడ్‌లో నిలదొక్కుకోవాలంటే అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్ మరియు యాక్షన్ స్కిల్స్ ఉండాలి ఇదే సూత్రాన్ని దిశా ఫాలో అవుతోంది. సోషల్ మీడియాలో కుర్రకారుకు నిద్ర పట్టకుండా చేస్తున్న ఈ ముద్దుగుమ్మ, ఇప్పుడు హాలీవుడ్ యూత్‌ను ఏ రేంజ్‌లో మెప్పిస్తుందో వేచి చూడాలి. ఈ పోర్టల్ ఆఫ్ ఫోర్స్ ఆమె కెరీర్‌ను మలుపు తిప్పుతుందా అనేది చూడాలి.

# రమణీ కల్యాణం టీజర్ విడుదల



సూర్య వశిష్ట, దీప్సికా చంద్రన్ జంటగా నటించిన కుటుంబ కథా చిత్రం రమణీ కల్యాణం. విజయ్ ఆదిరెడ్డి దర్శకత్వం వహించిన ఈ మూవీ త్వరలో ప్రేక్షకుల ఎదుటకు రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా ఈ మూవీ టీజర్ విడుదల చేశారు.

ఈ టీజర్‌ను చూస్తే.. చాలా రోజుల తర్వాత క్లీన్‌ఫ్యామిలీ ఎంటర్ టైన్ సినిమా థియేటర్లకు వస్తున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. అంధురాలైన ప్పటికీ సమయ స్ఫూర్తి, చలాకీతనం మెండుగా ఉన్న యువతి, ఫెరాలసిస్ వచ్చి వీల్‌చైర్‌కే పరిమితమైన అబ్బాయి మధ్య ప్రేమ, ప్రెమ పెళ్లి అనే అంశాల చుట్టూ సాగుతూ మంచి వినోదం పంచుతుందనే ఫీల్ ఇచ్చేలా టీజర్ ఉంది. మీరూ ఓ లుక్ వేయండి. ‘ఈమధ్య కాలంలో చిన్న సినిమాల్లో కూడా చాలా మంచి చిత్రాలు వస్తున్నాయి. ‘రమణి కల్యాణం’ కూడా అలాంటి మంచి సినిమానే. ఇందులో హీరో, హీరోయిన్లు అద్భుతంగా నటించారు. సంగీతం కూడా చాలా బాగుంది. నేను ఈ సినిమా చూశాను. మంచి ఫీల్‌గుడ్ మూవీ ఇది. కచ్చితంగా అందరికీ నచ్చుతుంది’ అని అన్నారు సీనియర్ నటి జయసుధ. సూర్య వశిష్ట, దీప్షిక చంద్రన్ జంటగా విజయ్ ఆదిరెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘రమణి కల్యాణం’. కైట్స్ క్రియేటివ్స్ బ్యానర్‌పై విజయ్ ఆదిరెడ్డి, మనోజ్ చింతిరెడ్డి, శ్రీనాథ్ పసుపులేటి, సంజయ్ వెంపరాల నిర్మించారు. సినిమా ఈనెల 22న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకలో టీజర్‌ని జయసుధ ఆవిష్కరించారు. హీరో సూర్య వశిష్ట మాట్లాడుతూ ‘ఇలాంటి కథలు చాలా అరుదుగా వస్తాయి. ఇందులో ఛాలెంజింగ్ రోల్ చేశాను. వీల్‌చైర్‌లో కూర్చొని ఎటూ కదలకుండా నటించడం ఒక సవాల్‌గా అనిపించింది’ అని అన్నారు. ‘ఈ సినిమా ప్రతి ఒక్కరికీ ఒక హోప్‌ని ఇస్తుంది. మంచి పాజిటివ్ ఎనర్జీ ఇచ్చే చిత్రమిది’ అని హీరోయిన్ దీప్షిక చంద్రన్ తెలిపారు. అందరూ థియేటర్‌లో సినిమా చూసి సపోర్ట్ చేయాలని దర్శకుడు విజయ్ ఆదిరెడ్డి, నిర్మాత శ్రీనాథ్ పసుపులేటి కోరారు.




# 23న భోపాల్‌లో ‘పెద్ది’ స్పెషల్ సాంగ్ ఈవెంట్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ చిత్రం ‘పెద్ది’ నుంచి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ వచ్చేసింది. సినిమా ప్రమోషన్లకు ఒక గ్రాండ్ మ్యూజికల్ ఈవెంట్‌తో కిక్ ఇచ్చేందుకు చిత్రబృందం సిద్ధమైంది. ఈ మేరకు మే 23న మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ‘సౌండ్ ఆఫ్ పెద్ది’ పేరుతో జరగనున్న ఈ ఈవెంట్‌లో భాగంగా సినిమాలోని ఒక ప్రత్యేక గీతాన్ని పరిచయం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ఆకర్షణగా సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ నిలవనున్నారు. ఆయన ఈ వేదికపై లైవ్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నట్లు మేకర్స్ తెలిపారు. దీంతో ఈ ఈవెంట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో రామ్ చరణ్‌కు జోడీగా జాన్వీ కపూర్ నటిస్తోంది. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్‌తో పాటు జగపతి బాబు, బొమన్ ఇరానీ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ స్పష్టం చేసింది. భోపాల్ ఈవెంట్‌తో సినిమా ప్రచార కార్యక్రమాలు ఊపందుకుంటాయని ఫ్యాన్స్ భావిస్తున్నారు. కాగా, మే 18న పెద్ది ట్రైలర్ రిలీజ్ అవుతున్న సంగతి తెలిసిందే. ముంబైలో పెద్ది ట్రైలర్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్ గా నిర్వహించనున్నారు. దీంతో ఈ చిత్రం ప్రమోషన్స్ అధికారికంగా ప్రారంభం కానున్నాయి.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem, VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**